# గల్లంతైన మత్స్యకారుల కోసం బీజేపీ రంగంలోకి



(మొదటి పేజీ తరువాయి)

మత్స్యకారుల భద్రత కోసం వేటకు వెళ్లే వారికి ప్రమాద బీమా తప్పనిసరి చేయాలని, లైఫ్ జాకెట్లలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి వారి ఆచూకీని సులభంగా గుర్తించే వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని మాధవ్ సూచించారు. అలాగే మెకనైజ్డ్ బోట్లకు జీపీఎస్ పరికరాలు తప్పనిసరిగా అమర్చడంతో పాటు వాటిని కోస్ట్ గార్డ్ నియంత్రణ కేంద్రంతో అనుసంధానం చేస్తే అత్యవసర పరిస్థితుల్లో రక్షణ చర్యలు మరింత సమర్థవంతంగా సాగుతాయని పేర్కొన్నారు.

గల్లంతైన మత్స్యకారులు క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని మాధవ్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హైకోర్టు బలోపేతం

(మొదటి పేజీ తరువాయి)

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలపడంతో ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి కేంద్ర న్యాయశాఖ ఇటీవల అధికారిక నోటిఫికేషన్ జారీ చేసింది.

కొత్త నియామకాలతో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 29 నుంచి 32కు పెరిగింది. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో హైకోర్టు ఫుల్ బెంచ్ న్యాయమూర్తులు, బార్ కౌన్సిల్ ప్రతినిధులు, హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, న్యాయాధికారులు, రిజిస్ట్రార్లు, న్యాయశాఖ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# జువ్వలదిన్నె హార్బర్‌కు ప్రైవేట్ నిర్వహణ

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం రూ. 306.29 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు 95.51 శాతం పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఫిషింగ్ హార్బర్ల నిర్వహణలో అమలవుతున్న విజయవంతమైన విధానాలను అధ్యయనం చేసిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అత్యధిక వార్షిక లైసెన్స్ ఫీజు కోట్ చేసిన సంస్థను ఎంపిక చేస్తామని, అయితే హార్బర్ భూమిపై ఎలాంటి యాజమాన్య హక్కులు లేదా లీజు హక్కులు కల్పించబోమని స్పష్టం చేశారు.

ప్రైవేట్ నిర్వహణతో హార్బర్‌లో పరిశుభ్రత, భద్రత, ఐస్ ప్లాంట్లు, కోల్డ్ స్టోరేజ్, వేలం వ్యవస్థ, మానవ వనరుల నిర్వహణ మరింత సమర్థవంతంగా సాగుతుందని మంత్రి పేర్కొన్నారు. పారదర్శక వేలం విధానం ద్వారా మధ్యవర్తుల ప్రభావం తగ్గి మత్స్యకారులకు పోటీ ధరలు లభించి ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. చేపల నాణ్యత మెరుగుపడటంతో పాటు వేట అనంతర నష్టాలు కూడా తగ్గుతాయని తెలిపారు.

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ద్వారా సుమారు 6,100 మంది మత్స్యకారులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుండగా, చేపల వ్యాపారం, ఐస్ పరిశ్రమ, రవాణా, అనుబంధ రంగాల్లో వేలాది మందికి పరోక్ష ఉపాధి లభించనుందని మంత్రి వివరించారు. హార్బర్‌లో 1,250 బోట్లకు నిలుపుదల సౌకర్యం, బ్రేక్‌వాటర్లు, డ్రెడ్జింగ్, క్వేలు, ఆక్షన్ హాళ్లు, ట్యూనా ప్యాకింగ్ హాల్, కోల్డ్ స్టోరేజ్, ఐస్ ప్లాంట్, నెట్ మెండింగ్ షెడ్లు, విశ్రాంతి గదులు, కమ్యూనిటీ హాల్, అంతర్గత రహదారులు, పార్కింగ్, కోస్టల్ పోలీస్ స్టేషన్ వంటి అత్యాధునిక మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# 'మీ మార్ట్'కు శ్రీకారం



(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు ఒకే చోట నాణ్యమైన నిత్యావసర వస్తువులను అందుబాటు ధరలకు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. సంప్రదాయ రేషన్ దుకాణాలను ప్రజలకు మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దుతూ, వాటిని బహుళ సేవలు అందించే కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందన్నారు. "మీ మార్ట్" ద్వారా ప్రజలకు నాణ్యమైన వినియోగ వస్తువులు సరసమైన ధరలకు లభించడంతో పాటు, రేషన్ డీలర్లకు అదనపు ఆదాయ అవకాశాలు కల్పించబడతాయని మంత్రి పేర్కొన్నారు. ఈ విధానం వల్ల ప్రజలకు మెరుగైన సేవలు అందడంతో పాటు ప్రజా పంపిణీ వ్యవస్థపై విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు. రేషన్ దుకాణాల ఆధునికీకరణ, పారదర్శకత, సేవల నాణ్యత పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, "మీ మార్ట్ (నీది.. నాది.. మనందరిది)" కార్యక్రమం ఆ దిశగా ఒక కీలక ముందడుగుగా నిలుస్తుందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి 29,750 రేషన్ షాపులను ఆధునికరించేందుకు, పౌరసరఫరాల శాఖలో సంస్కరణలను తీసుకువచ్చేందుకు ఇటీవలే గుజరాత్ రాష్ట్రాన్ని సందర్శించామన్నారు. ఈ మినీ మార్ట్ లను 60 రకాల సరుకులతో ప్రారంభించి, రాబోయే రోజుల్లో 250 రకాల నాణ్యమైన సరుకులను ప్రజలకు అందిస్తామన్నారు. ఆహార సబ్సిడీలను డిజిటల్ రూపంలో అందించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రజలు ఈ వినూత్న కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు మంత్రి పిలుపునిచ్చారు.

స్థానిక శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులులి మాట్లాడుతూ నాణ్యమైన సరుకులను పేద ప్రజలకు తక్కువ ధరకు అందించాలన్న లక్ష్యంతో తలపెట్టిన మీ మార్ట్ లను రాష్ట్రంలోనే తొలిసారిగా పత్తిపాడు నియోజకవర్గంలో ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం నూతన విధానాలను ఆలోచిస్తూ, రేషన్ దుకాణాలను బలోపేతం చేస్తూ ఇటువంటి మార్ట్ లను ప్రారంభించిందన్నారు.

ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, పౌరసరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు, డైరెక్టర్ శ్రీవాస్ నుపుర్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై ఫాస్ట్‌ట్రాక్!



(మొదటి పేజీ తరువాయి)

తెలుసుకునే అవకాశం ఉంటుంది. నియోజకవర్గస్థాయిలో లాస్ట్ మైల్ గవర్నెన్స్ ప్రజలకు అందాలి. రాష్ట్ర అభివృద్ధిలో ప్రజాపాలనలో పొలిటికల్ మేనేజ్మెంట్–బ్యూరోక్రటిక్ యాక్షన్ సమపాళ్లలో ఉండాలి. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి. వివిధ కేటగిరీలు, శాఖలకు చెందిన పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ఓ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి. క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా కలెక్టర్లు, ఉన్నతాధికారులు భాధ్యత తీసుకోవాలి." అని అన్నారు.

**మూడు నెలల్లో యూఎల్‌బీల్లో చెత్త తొలగింపు :** గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్ల ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గాలని... గంజాయి మూలాలను పూర్తిగా నియంత్రించాలన్నారు. గంజాయి నిర్మూలనపై తీసుకుంటున్న చర్యలపై సమాచారాన్ని ప్రజల్లోకి వెళ్లేలా చూడాలని సీఎం నిర్దేశించారు. కేంద్రం కూడా డ్రగ్ ఫ్రీ కంట్రీగా భారత్‌ను తయారుచేసేలా కార్యాచరణ చేపట్టిందని దానికి అనుగుణంగానే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల ద్వారా ఎలాంటి ఫలితాలు సాధిస్తున్నామో అన్న అంశాన్ని కూడా ఎప్పటికప్పుడు విశ్లేషించాలని సీఎం అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో తాగునీరు, వ్యర్థాల సేకరణకు స్వచ్ఛ రథాలు, ఇంటింటికీ చెత్త సేకరణ లాంటి అంశాల్లో నిర్దుష్టమైన ఎస్ఓపీ జారీ చేయాలని సీఎం అన్నారు. మున్సిపాలిటీలు, కార్పోరేషన్లలో పేరుకున్న 23 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను మూడు నెలల్లోగా తొలగించాలని దీనిపై ప్రజాప్రతినిధులు కూడా శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. జీరో వేస్ట్ మున్సిపల్ ప్రాంతాలు మన లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి అన్నారు.

**ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి పెద్ద పీట :** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, పీజీఆర్ఎస్ ద్వారా వస్తున్న దరఖాస్తులను ఆర్థిక, ఆర్థికేతర కేటగిరీలుగా విభజించి పరిష్కారం చూపాలని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో కలెక్టర్లు అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని సూచించారు. వివిధ సమస్యల్ని ఎదుర్కోనేలా ఇతర ప్రాంతాల్లో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను అనుసరించటంతో పాటు ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతీ అంశంలోనూ పొదుపు మంత్రం పాటించాలని సీఎం నిర్దేశించారు. నెలరోజుల్లోగా అన్ని ప్రభుత్వ శాఖలూ అవేర్ 2.0 ద్వారా ఏమేరకు ఫలితాలు వచ్చాయో విశ్లేషించాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనికేషన్ నెట్వర్క్ కనెక్టివిటీ కోసం మారుమూల ప్రాంతాల్లో టవర్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలన్నారు. ఆపరేటర్లను సంప్రదించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షకు మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, పురపాలక, ఎక్సైజ్, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# నేతన్నలకు వరాల జల్లు

(మొదటి పేజీ తరువాయి)

అందజేయనున్నామన్నారు. నేతన్నలకు పెట్టుబడి భారం తగ్గించేలా ఆప్కో ద్వారా నూలు అందజేసే ఆలోచన చేస్తున్నామన్నారు. రెండేళ్ల కూటమి పాలనలో ఆప్కో బలోపేతానికి చర్యలు తీసుకున్నామన్నారు. మంగళగిరిలోని ఆప్కో తోటలో ఆ సంస్థ స్వర్ణోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సవిత జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, తాను చేనేత, జౌళి శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఆప్కో స్వర్ణోత్సవాలు జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఏ లక్ష్య సాధనకు ఆప్కోను ఏర్పాటు చేశారో ఆ దిశగా సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ రేయింబవళ్లు కష్టపడుతున్నారన్నారు. అన్న ఎన్టీఆర్ జనతా వస్త్రాల పేరుతో చేనేత వస్త్రాలకు ప్రాచుర్యం కల్పించారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు... నేతన్నల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూనే, ఏపీ చేనేత రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళుతున్నారన్నారు. ఆప్కోలో చేపట్టిన డిజిటలైజేషన్ కు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు లభించిందన్నారు. ఆప్కోను లాభాల పట్టేలా ప్రక్షాళన చేపట్టామన్నారు. నేటితరం అభిరుచులను దృష్టిలో పెట్టుకుని, చేనేత రెడీమెడీ వస్త్రాలను అమ్మకాలు చేస్తున్నామన్నారు. ఇందుకు అవసరమైన శిక్షణను నేతన్నలకు అందజేస్తున్నామన్నారు. నేత కార్మికులకు ఆర్థిక భరోసా కలిగించేలా డైయింగ్, బ్లీచింగ్ ఛార్జీలు, టవల్స్, ఇతర వస్త్రాల నేత ఛార్జీలు పెంచామన్నారు. త్వరలో నేతన్న భరోసా పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ఇప్పటికే ప్రారంభమైందని మంత్రి సవిత వెల్లడించారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా మాట్లాడుతూ, ఆప్కో బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రెడీమేడ్ వస్త్రాల తయారీపై చేనేతలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.




**త్వరలో రూ.6.50 కోట్ల బకాయిల చెల్లింపు :** అనంతరం తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడుతూ, 2014-19లో సీఎం చంద్రబాబునాయుడు పాలన చేనేత రంగానికి స్వర్ణయుగం లాంటిందన్నారు. తరవాత వచ్చిన జగన్... అన్ని వ్యవస్థల మాదిరిగానే చేనేత రంగాన్ని భ్రష్టుపట్టించారన్నారు. ఆప్కో పేరు మీద తీసుకొచ్చిన రూ. 100 కోట్లను జగన్ పక్కదారి పట్టించారన్నారు. ఇప్పుడు ఆ బకాయి భారం ఆప్కోపై పడిందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా చేనేత సహకార సంఘాల కొనుగోలు చేసిన వస్త్రాలకు నగదు చెల్లిస్తున్నామన్నారు. ఈ నెల 15న సంక్షేమ హాస్టళ్లకు అందజేసిన దుప్పట్లు, ఇతర వస్త్రాలకు చెందిన రూ.4 కోట్ల బకాయిలను చెల్లించనున్నామన్నారు. వచ్చే నెల మొదటివారంలో సాధారణ చేనేత ఉత్పత్తులకు రూ. 2.50 కోట్లను చెల్లించనున్నట్లు తెలిపారు. ఆప్కో బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఆ సంస్థకు పూర్వ వైభవం తీసుకొస్తామని మంత్రి సవిత తెలిపారు.

**చేనేత బ్రాండ్ అంబాసిడర్లగా చంద్రబాబు, పవన్, లోకేశ్ :** అందరూ చేనేత వస్త్రాలు ధరించాలంటూ చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేలా సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని మంత్రి సవిత కొనియాడారు. రాష్ట్రంలో చేనేత రంగానికి ఆ ముగ్గురూ బ్రాండ్ అంబాసిడర్లగా వ్యవహరిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత రంగానికి మరోసారి స్వర్ణయుగం ప్రారంభమైందన్నారు. చేనేతలకు 50 ఏళ్లకే రూ. 4 వేల పెన్షన్ అందజేస్తున్నామన్నారు. ఏటా త్రిఫ్ట్ ఫండ్ కింద రూ. 5 కోట్లు మంజూరు చేస్తున్నామన్నారు. ఆప్కో కొనుగోలు చేసే వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ మినహాయించామన్నారు. 15 శాతం సబ్సిడీతో నూలు అందజేస్తున్నామన్నారు. నేతన్నలకు పెట్టుబడి భారం తగ్గించేలా ఆప్కో ద్వారా నూలు అందజేసే ఆలోచన కూడా చేస్తున్నామన్నారు. చేనేతలకు 365 రోజుల పాటు ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఆప్కో చరిత్రలో మొట్టమొదటిసారిగా టీటీడీతో ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. ఆసక్తి కలిగిన చేనేత సహకార సంఘాలు ముందుకొస్తే... టీటీడీకి అవసరమైన దుశ్శాలువాలు, చీరలు, జాకెట్లు, కండువాలు పంపిణీ చేసే ఆర్డర్ ఇస్తామని మంత్రి సవిత తెలిపారు. అనంతరం రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత సహకార సంఘాలా ప్రతినిధులను మంత్రి సవిత సత్కరించారు. ఆప్కోలో పనిచేసే పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రూ. 1.20 లక్షల విలువ చేసే బెనిఫిట్స్‌ను చెక్ రూపంలో మంత్రి సవిత అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆప్కో ప్రతినిధులు, పలు కార్పొరేషన్ చైర్మన్లు నందం అబద్ధయ్య, పేరేపి ఈశ్వర్, ఆకాశపు స్వామి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ధనుంజయ రావు, పెద్ద సంఖ్యలో నేతన్నలు, పాల్గొన్నారు.

# 20 వేల స్టార్టప్‌లే లక్ష్యం!



(మొదటి పేజీ తరువాయి)

**స్టార్టప్ కారిడార్ ఏర్పాటుకు కలిసి పనిచేద్దాం :** ఆర్‌టీఐహెచ్‌ను కేంద్రంగా చేసుకుని ఇండియా–కొరియా స్టార్టప్ కారిడార్ ఏర్పాటు కోసం కలిసి పనిచేద్దామని కొరియన్ సంస్థలను ఆహ్వానిస్తున్నాం. ఒక ప్రత్యేక కొరియా డెస్క్, సాఫ్ట్–ల్యాండింగ్ "విసి బే", కొరియన్ ఏజెన్సీలతో (కోట్రా/కె–స్టార్టప్) సహ–ఇంక్యుబేషన్ ఏర్పాటుచేస్తాం. దీనిద్వారా రెండువైపులా మార్కెట్ ప్రవేశం లభిస్తుంది. కొరియన్ స్టార్టప్‌లు భారతదేశంలోని టైర్ 2--3 మార్కెట్లలోకి, ఆంధ్రప్రదేశ్ స్టార్టప్‌లు కొరియాలోకి రావడం సులభతరమవుతుంది. భారతదేశ ఆక్వాకల్చర్‌లో ఆంధ్రప్రదేశ్ సుమారు 40% వాటాను కలిగి ఉంది, 1,053 కిలోమీటర్ల సుదూర తీరప్రాంతం వెంబడి లాజిస్టిక్స్, ఫిన్‌టెక్, డీప్–టెక్, ఫ్రాంటియర్ టెక్, అధునాతన తయారీ హబ్ లలో పెట్టుబడులు కొరియన్ సంస్థలకు లాభసాటి కాగలవని మంత్రి లోకేష్ చెప్పారు.

**అమరావతిలో తొలి క్వాంటం-ఏఐ యూనివర్సిటీ :** ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశ ఏఐ రాజధానిగా నిలపడం మాధ్యేయం. ఇందులో భాగంగా గూగుల్ ఏఐ హబ్ (ఏప్రిల్ 2026లో శంకుస్థాపన చేశాం. రిలయన్స్, సిఫీ, కంట్రోల్‌ఎస్ తదితర సంస్థలు ఏపీలో 10 గిగావాట్ల డేటా–సెంటర్ పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నాయి. తద్వారా స్టార్టప్‌లకు సరసమైన ధరలకు పెద్ద ఎత్తున కంప్యూటింగ్, డిజిటల్ మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. భారతదేశపు మొట్టమొదటి క్వాంటం & AI విశ్వవిద్యాలయం అమరావతి క్వాంటం వ్యాలీలో ఆవిష్కృతమవుతోంది. దీనిద్వారా భారతదేశపు అత్యంత అధునాతన 133–క్యూబిట్ IBM క్వాంటం సిస్టమ్ టూల్, IBM--TCS క్వాంటం క్లౌడ్ సర్వీసెస్, ఒక క్వాంటం హార్డ్‌వేర్ పార్క్ అందుబాటులోకి రానున్నాయి. కొరియన్ డీప్–టెక్ స్టార్టప్‌ల పరిశోధన, సహ–అభివృద్ధికి ఇది ఉపయోగపడుతుందని మంత్రి లోకేష్ చెప్పారు. రౌండ్ టేబుల్ సమావేశంలో స్టార్టప్‌ల వ్యవస్థాపకులు, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# 'కాన్పుల మధ్య విరామం.. తల్లీబిడ్డకు క్షేమం'

(మొదటి పేజీ తరువాయి)



ఎక్కువ మంది ఉంటే లక్కీ డిప్ ద్వారా లబ్ధిదారులను ఎశీపిక చేస్తామని తెలిపారు.

**కనీసం రెండేళ్ల వరకు విరామం :** కాన్పు, కాన్పునకు మధ్య కనీసం రెండేళ్ల వరకు విరామం పాటిస్తే తల్లీబిడ్డల ఆరోగ్యానికి మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఈ విధానాన్ని పాటిస్తే మాతృత్వ మరణాల్లో 30 శాతం, శిశు మరణాల్లో 10 శాతం వరకు తగ్గుతాయని పేర్కొన్నారు.

**ప్రభుత్వ శాఖల భాగస్వామ్యం :** యుక్తవయస్సు గర్భధారణలు ఎక్కువగా నమోదవుతున్న జిల్లాలు, మండలాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. ప్రసవానంతరం అమర్చే గర్భనిరోధక సాధనం, 'అంతరా' సూది తదితర పద్ధతులపై అవగాహన కల్పించనున్నారు.

జిల్లా, మండల స్థాయిలో సమావేశాలు, ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పంచాయతీరాజ్ సంస్థలు, పురపాలక సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, మహిళా శిశు అభివృద్ధిశాఖ సిబ్బంది, ఇతర ప్రజా భాగస్వామ్య సంస్థలను ప్రచారంలో భాగస్వాములను చేస్తున్నట్లు రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కేవీఎన్ చక్రధర్ బాబు తెలిపారు

**వైద్యులు ఇతర సిబ్బందికి కూడా :** ఉత్తమంగా పనిచేసిన వైద్యులు, సిబ్బందికి నగదు పురస్కారాలు ఇవ్వనున్నట్లు చక్రధర్ బాబు తెలిపారు. కార్యక్రమాల నిర్వహణకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కలిపి రూ. 2 లక్షల చొప్పున మొత్తం రూ. 56 లక్షలను విడుదల చేశామని చెప్పారు.

# వనరులే... వృద్ధికి బాట!

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఉద్యానవన పంటల సాగుతో తలసరి ఆదాయంలో సరికొత్త రికార్డ్ సృష్టించిన కడప జిల్లా లింగాలం మండలం స్ఫూర్తితో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్ పురోగతికి హార్టికల్చర్ గ్రోత్ ఇంజిన్ అవుతుందని... 25కు పైగా ఉద్యాన ఉత్పత్తులు సాధించేలా చూడాలన్నారు. ఈ ప్రాంత స్థితిగతులు మార్చే శక్తి హార్టికల్చర్‌కు ఉందని... తిరుపతి ఎకనామిక్ రీజియన్ మాస్టర్ ప్లాన్‌లో రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్దేశించారు. పూర్వోదయ పథకం కింద రూ. 40,000 కోట్లు, ప్రైవేట్ పెట్టుబడుల రూపంలో వచ్చే మరో రూ. 60,000 కోట్లు ఉద్యానవన రంగానికి ఊతమిస్తాయని అధికారులకు సీఎం చెప్పారు. పారిశ్రామికంగా అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతాల కన్నా...సీమలోని ఓ మండలంలో ప్రజల తలసరి ఆదాయం అధికంగా ఉండటాన్ని అధ్యయనం చేయాలని సీఎం అన్నారు. కడప జిల్లా లింగాల మండలంలో ప్రజలు రూ. 7.30 లక్షలు తలసరి ఆదాయం కలిగి ఉండడం హార్టికల్చర్ పంటల సాగు వల్ల కలిగే లాభాలకు నిదర్శనమని సీఎం స్పష్టం చేశారు. హార్టికల్చర్ కు అత్యంత అనువైన రాయలసీమలో ఆ దిశగా ప్రజలను మరింత ప్రోత్సహించాలన్నారు. సీమలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను తీసుకువస్తే అక్కడ ప్రజల జీవన ప్రమాణాలు పూర్తిగా మారుతాయని సిఎం అన్నారు. ఆ దిశగా జిల్లా అధికారుల నుంచి ఎమ్మెల్యేలు, మంత్రుల వరకు ప్రణాళికతో పనిచేయాలన్నారు. సచివాలయంలో సోమవారం రాష్ట్రంలోని మూడు ఎకనామిక్ రీజియన్లపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా 3 రీజియన్ల అభివృద్ధికి కార్యాచరణపై పలు మార్గదర్శకాలను సూచించారు. ఇప్పటికే విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రణాళిక ఆవిష్కరించగా... 6 నెలల్లో అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ సిద్ధమయ్యాక ముసాయిదాను ప్రజలు, ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉంచి అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు. రెండు నెలల్లో డిస్ట్రిక్ట్ ఎకనమిక్ ప్రొఫైల్ ను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. జిల్లాల కలెక్టర్లు ఏ రంగాల్లో తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందో ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.



**అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ సిటీలు :** అమరావతి, తిరుపతి, విశాఖలో అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో మూడు ప్రాంతాల్లోనూ స్పోర్ట్స్ సిటీల అభివృద్ధి జరగాలన్నారు. ఏపీకి ఉన్న సుదీర్ఘ తీరప్రాంతంలో సూర్య లంక సహా వివిధ ప్రాంతాల్లోని బీచ్ ఫ్రంట్ లను అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. సూర్య లంక బీచ్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని సీఎం నిర్దేశించారు. తీరప్రాంత పర్యాటకం, గ్లోబల్ బిజినెస్–ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్, గ్లోబల్ టాలెంట్–ఎలైట్ లివింగ్ అనే 3 పిల్లర్లపై 'వైజాగ్ బే సిటీ' అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌లోని 51.88 చదరపు కి.మీ. విస్తీర్ణంలో 'వైజాగ్ బే సిటీ' అభివృద్ధికి పెట్టుబడులు పెట్టేలా ప్రముఖ సంస్థల్ని ఆహ్వానించాలన్నారు. బే సిటీలో 3,291 ఎకరాల ప్రభుత్వ భూమి లభ్యత ఉందని గుర్తించినట్టు ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. అలాగే విశాఖ ఎకనామిక్ రీజియన్లో ఇప్పటికి మొత్తం 49 ప్రాజెక్టులు రాగా... వీటిలో 18 ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యాయని, మరో 12 త్వరలో గ్రౌండ్ కానున్నాయని అధికారులు వివరించారు. మరో 19 ప్రాజెక్టులు ప్రణాళిక దశలో ఉన్నాయని చెప్పారు. అయితే వీటితో పాటు వచ్చే 3 నెలల్లో లక్ష చదరపు అడుగుల్లో ఇంటర్నేషనల్ కన్వెన్సన్ సెంటర్, హోటళ్లు, ఐటీ ప్రాజెక్టులు వచ్చేలా చూడాలని సీఎం లక్ష్యాన్ని నిర్దేశించారు. అరకు–పాడేరు–విశాఖను పర్యాటక సర్కిల్‌గా రూపొందించి ప్రత్యేక ఆకర్షణ తీసుకురావాలన్నారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్లతో విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధికి ఎంతో ఆస్కారం ఉందన్నారు. వెల్నెస్ సెంటర్లకు ప్రత్యేకంగా భూకేటాయింపులు జరపాలన్నారు.

**అమరావతి ఎకనామిక్ రీజియన్ :** రాష్ట్ర జనాభాలో 32 శాతం అమరావతి ఎకనామిక్ రీజియన్‌లో నివసిస్తున్నారని... భౌగోళికంగా 33 శాతం విస్తరించి ఉందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. భౌగోళికంగా రాష్ట్రానికి మధ్యలో ఉండటం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉండటం ఏఈఆర్‌కు కలిసొచ్చే అంశమని అన్నారు. పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం...మొత్తం 9 జిల్లాలు అమరావతి ఎకనామిక్ రీజియన్ పరిధిలో ఉండగా... వీటిలో అన్నింటికన్నా కృష్ణా జిల్లా తలసరి ఆదాయంలో ముందుందని అధికారులు చెప్పారు. జిల్లాల వారీగా రీజియన్ అభివృద్ధి జరిగేలా వర్క్ షాపులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆక్వా, పామాయిల్, కోకో ఉత్పత్తులతో పాటు...కొల్లేరు సరస్సును రీజియన్ అభివృద్ధి కోసం వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు.

**వీఈఆర్, ఏఈఆర్‌తో పోటీపడేలా టీఈఆర్ :** ఖనిజ సంపద నుంచి హార్టికల్చర్ వరకు...పుణ్యక్షేత్రాల నుంచి పర్యాటక ప్రాంతాల వరకు రాయలసీమకు ఉన్న అనుకూలతను మార్కెటింగ్ చేసుకోవాలని సీఎం అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కలిసి పనిచేస్తే పెద్దఎత్తున పెట్టుబడులు... తద్వారా యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. విశాఖ, అమరావతి రీజియన్లతో పోటీ పడేలా తిరుపతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి జరగాలన్నారు. తిరుపతి, శ్రీకాళహస్తి, శ్రీశైలం వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలు, ఐఐటీ వంటి విద్యా సంస్థలు, గోల్డ్, ఐరన్ ఓర్, లైమ్ స్టోన్ వంటి ఖనిజ వనరులు రాయలసీమ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. గండికోట, హార్సిలీహిల్స్, తలకోన వంటి పర్యాటక ప్రాంతాలను ఇంటిగ్రేట్ చేయాలన్నారు. శ్రీసిటీ దేశంలోనే నెంబర్ వన్ ఇండస్ట్రియల్ పార్క్‌గా నిలుస్తోందని... అలాగే ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామికవాడలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్స్, రెన్యువబుల్ ఎనర్జీ, ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్... ఇలా అన్ని రంగాల్లోనూ పెట్టుబడులకు తిరుపతి రీజియన్ అనుకూలమన్నారు. ఇచ్ఛాపురం నుంచి చెన్నయ్ వరకు నాలుగు వరుసల రైల్వే లైన్ వస్తోందని... మౌలిక వసతులను వినియోగించుకుని టీఈఆర్‌ను మరింతగా ఎలా అభివృద్ధి చేయాలో ఆలోచన చేయాలన్నారు.

**0.90 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా టీఈఆర్ :** స్వర్ణాంధ్ర 2047 విజన్ మేరకు 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీని తయారు చేయాలన్న లక్ష్యంలో భాగంగా .. తిరుపతి ఎకనమిక్ రీజియన్ వాటాగా 0.90 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవాలని లక్ష్యం పెట్టుకున్నట్టు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. టీఈఆర్ ప్రణాళికల కోసం ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేశామన్నారు. తిరుపతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, కడప, అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, అన్నమయ్య...మొత్తం 9 జిల్లాలను సమగ్రంగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని అధికారులు చెప్పారు. ప్రతీ 2 నెలలకు ఒకసారి 3 ఎకనామిక్ రీజియన్లపై సమీక్ష నిర్వహిస్తామని సీఎం అన్నారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈ మూడు రీజియన్ల ప్రత్యేక అధికారులు ముఖేష్ కుమార్ మీనా, సురేశ్ కుమార్, యువరాజ్ లు పాల్గొన్నారు.

## చరిత్రలో నిలిచేలా గుమ్మడి
# శతజయంతి వేడుకలు



(మొదటి పేజీ తరువాయి)

గుడివాడ ఆధ్వర్యంలో 'బంధాల చంద్రయ్య నాయుడు' సాంఘిక నాటికను ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా శతజయంతి వేడుకల కరపత్రాన్ని ఆవిష్కరించారు.

వేడుకల్లో భాగంగా అజో–విభో–కందాళం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆచార్య అప్పాజ్యోస్యుల సత్యనారాయణకు డాక్టర్ గుమ్మడి వెంకటేశ్వరరావు విశిష్ట కళా పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి శాసనసభ ఉపసభాపతి కె. రఘురామకృష్ణంరాజు, మంత్రి నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, సినీ నటుడు మురళీమోహన్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, నారా భువనేశ్వరి, నక్కా ఆనందబాబు, సినీ నటి దేవభక్తుని ప్రభా రమేష్, నాటక రచయిత డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, సినీ పాత్రికేయుడు డాక్టర్ రెంటాల జయదేవ్ తదితరులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. సమావేశంలో నన్నపనేని సుధాకర్, మహమ్మద్ కుద్దూస్, జొన్నాదుల మహేష్, గుమ్మడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ జేఏసీ-అధికారుల చర్చలు విఫలం

○ 7, 8 తేదీల్లో 'ఆర్టీసీ పరిరక్షణ దినం'గా నిరసనలు

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జేఏసీ, అధికారుల మధ్య సోమవారం జరిగిన చర్చలు ఎలాంటి ఫలితాన్నీ ఇవ్వలేదు. విద్యుత్ బస్సుల నిర్వహణపై ప్రభుత్వం, యాజమాన్యం నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో ముందుగా ప్రకటించిన ఆందోళన కార్యక్రమాలను యథావిధిగా కొనసాగించాలని జేఏసీ నిర్ణయించింది. ఈ మేరకు జూలై 7, 8 తేదీల్లో 'ఆర్టీసీ పరిరక్షణ దినం' పేరుతో ఉద్యోగులు డిమాండ్లతో కూడిన బ్యాడ్జీలు ధరించి నిరసనలు చేపట్టనున్నట్లు జేఏసీ కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు తెలిపారు.

ఆర్టీసీ హౌస్‌లో కమిషనర్, ఆర్టీసీ వైస్ చైర్మన్–మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జేఏసీ ప్రతినిధులు పలు డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ బస్సుల కొనుగోలు, నిర్వహణ, మెయింటెనెన్స్, సిబ్బంది విధులు పూర్తిగా ఆర్టీసీ ద్వారానే నిర్వహించాలని, ప్రైవేటు ఆపరేటర్లకు అప్పగించవద్దని పట్టుబట్టారు. విద్యుత్ బస్సుల పేరుతో మూసివేసిన విద్యాపురం, గుంటూరు–2, నెల్లూరు–2 డిపోలను తిరిగి ప్రారంభించాలని, మంగళగిరి డిపోను ఖాళీ చేయించవద్దని కోరారు. అలాగే ప్రైవేటు విద్యుత్ బస్సుల కోసం ఆర్టీసీ డిపోల్లో స్థలాల కేటాయింపును నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

స్త్రీశక్తి పథకం కింద జారీ చేస్తున్న ఉచిత టికెట్లకు ప్రభుత్వం ప్రతి నెలా పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయాలని, పెరిగిన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 4 వేల కొత్త బస్సులు కొనుగోలు చేసి, ఖాళీగా ఉన్న సుమారు 12 వేల పోస్టులను భర్తీ చేయాలని జేఏసీ కోరింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు, పదోన్నతులు, క్యాడర్ పునర్వ్యవస్థీకరణ, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల బకాయిలు, సిబ్బంది కొరత, నిర్వహణ విభాగ సమస్యలు తదితర అంశాలను కూడా సమావేశంలో ప్రస్తావించినట్లు తెలిపారు.

ప్రభుత్వ పరిధిలోని అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, మిగిలిన సమస్యలపై త్వరలో మరోసారి చర్చలు నిర్వహిస్తామని అధికారులు హామీ ఇచ్చినప్పటికీ ఎలాంటి స్పష్టత రాలేదని జేఏసీ పేర్కొంది. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, ఆర్టీసీ పరిరక్షణ కోసమే తమ ఉద్యమమని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని కన్వీనర్లు హెచ్చరించారు. సమావేశంలో జేఏసీ కో–కన్వీనర్లు, వివిధ ఉద్యోగ సంఘాల రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు యువతకు ఆదర్శం



- **బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి ఎన్. మధుకర్**

**జంగారెడ్డిగూడెం (జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ యువ మోర్చా ఏలూరు జిల్లా ఆధ్వర్యంలో సోమవారం కళాశాల విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి ఎన్. మధుకర్ పాల్గొని ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ దేశ సమైక్యత, జాతీయవాదం కోసం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగాలు, సేవలు యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశ ప్రయోజనాల కోసం సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజాజీవితం గడిపిన మహనీయుడిగా ఆయన నిలిచారన్నారు. భారతదేశ సమగ్రత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు.

యువత దేశభక్తి, సేవాభావంతో ముందుకు సాగుతూ జాతీయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని మధుకర్ పిలుపునిచ్చారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను భావితరాలకు చాటిచెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.

కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా నాయకులు, జిల్లా నాయకులు, పార్టీ కార్యకర్తలు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## రేవుపోలవరం బోటు ప్రమాదంలో మత్స్యకారుడు మృతి

ఘటనపై అధికారులతో మాట్లాడిన మంత్రి అచ్చెన్నాయుడు

**అనకాపల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** అనకాపల్లి జిల్లా రేవుపోలవరం వద్ద జరిగిన బోటు ప్రమాదంలో మత్స్యకారుడు సింహాద్రి మృతి చెందగా, మరో ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. ఘటనపై రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

జిల్లా కలెక్టర్, మత్స్యశాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన వివరాలను మంత్రి తెలుసుకున్నారు.

# భయానకంగా మారిన శ్రీలంక జైలు

- **డ్రగ్స్ ముఠాల మధ్య ఘర్షణలు.. 25 మంది మృతి**

**కొలంబో:** శ్రీలంకలోని నగొంబొ జైలులో రెండు డ్రగ్స్ ముఠాలకు చెందిన ఖైదీల మధ్య చెలరేగిన ఘర్షణలు రక్తపాతానికి దారితీశాయి. ఈ దాడుల్లో 25 మంది ఖైదీలు మృతి చెందగా, వంద మందికిపైగా గాయపడినట్లు అధికారులు సోమవారం వెల్లడించారు. రాజధాని కొలంబోకు సమీపంలోని నగొంబొ జైలులో ఈ ఘటన చోటుచేసుకుంది.

**రెండు ముఠాల మధ్య గొడవతో ఉద్రిక్తత :** పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైదీలతో కిక్కిరిసిపోయిన నగొంబొ జైలులో ఆదివారం సాయంత్రం రెండు డ్రగ్స్ ముఠాలకు చెందిన ఖైదీల మధ్య వివాదం తలెత్తింది. అది క్రమంగా భౌతిక దాడులకు దారి తీసింది. జైలు సిబ్బంది పరిస్థితిని అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి.

**తుపాకులు లాక్కొని మళ్లీ దాడులు :** అల్లర్ల సందర్భంగా కొందరు ఖైదీలు జైలులోని ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంతో సోమవారం కూడా ఘర్షణలు కొనసాగాయి. క్షతగాత్రుల్లో కొందరికి తుపాకీ గాయాలు కాగా, మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

**పైకప్పుపైకి మహిళా ఖైదీలు :** ఘర్షణలు కొనసాగుతున్న సమయంలో సమీప విభాగంలో ఉన్న మహిళా ఖైదీలు భయంతో జైలు భవనం పైకప్పుపైకి ఎక్కి తమను సురక్షిత ప్రాంతానికి తరలించాలని అధికారులను కోరారు. దీంతో జైలు పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

**డ్రగ్స్ సరఫరాపై విభేదాలే కారణం :** జైలులో మాదకద్రవ్యాల సరఫరాకు మద్దతిస్తున్న వర్గానికి, దానిని వ్యతిరేకిస్తున్న వర్గానికి మధ్య నెలకొన్న విభేదాలే ఈ ఘర్షణలకు కారణమైనట్లు ప్రాథమిక విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. ఘటన అనంతరం జైలులో భద్రతను కట్టుదిట్టం చేసి, ప్రత్యేక పోలీసు బలగాలు, అల్లర్ల నియంత్రణ దళాలను మోహరించారు.

**ప్రత్యేక దర్యాప్తు :**
తదుపరి హింసను నివారించేందుకు ముగ్గురు ఖైదీలను మరో జైలుకు తరలించినట్లు అధికారులు తెలిపారు.




ఘటనపై జైళ్ల కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసినట్లు జైళ్ల శాఖ మీడియా ప్రతినిధి గజనాయకె వెల్లడించారు. పోలీసుల దర్యాప్తు కూడా కొనసాగుతోందని, సమగ్ర నివేదిక సమర్పించాలని న్యాయశాఖ మంత్రి ఆదేశించినట్లు పేర్కొన్నారు.

# ఒడిశా తీరంలో సురక్షితంగా ఉన్న మత్స్యకారులు క్షేమంగా వైజాగ్ చేరుకోనున్నారు

- **వైద్య పరీక్షల్లో ఆరోగ్యంగా ఉన్నట్లు నిర్ధారణ**
- **మంగళవారం ఉదయం విశాఖపట్నానికి చేరుకోనున్నారు : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఒడిశాలోని పరదీప్ తీరంలో చిక్కుకున్న మత్స్యకారులు అందరూ సురక్షితంగా పరదీప్ నౌకాశ్రయానికి చేరుకున్నారని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మత్స్యకారులను తీసుకొచ్చిన రెస్క్యూ బోటు ప్రస్తుతం భారత కోస్ట్ గార్డ్ నౌక వద్ద పరదీప్ హార్బర్‌లో ఉందని మంత్రి తెలిపారు. అక్కడే మత్స్యకారులకు వైద్య పరీక్షలు నిర్వహించగా, వారందరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు నిర్ధారించినట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున ఇచ్ఛాపురం పోలీసు సిబ్బంది ఇప్పటికే పరదీప్ హార్బర్‌కు చేరుకుని మత్స్యకారుల రాకకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. మత్స్యకారులను మంగళవారం ఉదయం విశాఖపట్నానికి తీసుకురానున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. వారి రాక అనంతరం అవసరమైన అన్ని సహాయ చర్యలు ప్రభుత్వం చేపడుతుందని తెలిపారు. మత్స్యకారుల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం. వారి క్షేమం కోసం ఎప్పటికప్పుడు సంబంధిత



అధికారులతో సమన్వయం చేస్తూ అన్ని చర్యలు తీసుకున్నాం. వారంతా సురక్షితంగా ఉండటం ఎంతో సంతోషకరం. మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# సచివాలయంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ శిబిరం ప్రారంభం

- **మూడు రోజుల పాటు ఉద్యోగులకు ప్రత్యేక సేవలు**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్–ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా సచివాలయ ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన మూడు రోజుల ప్రత్యేక శిబిరాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ సోమవారం ప్రారంభించారు. ఏపీ సచివాలయం మూడో భవనంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం హాలులో ఈ శిబిరాన్ని ప్రారంభించి, ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు.




ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే శిబిరాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని వివేక్ యాదవ్ సూచించారు. శిబిరంలో ఎన్యూమరేషన్ ఫారాల ఆన్‌లైన్ సమర్పణ, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పు తదితర సేవలను అందిస్తున్నారు. అలాగే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్నారు.

2002 నాటి ఓటరు వివరాలు, తాజా ఫొటో, ఓటరు గుర్తింపు కార్డు (ఈపీఐసీ), ఆధార్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రాలతో వచ్చిన ఉద్యోగుల వివరాలను నమోదు చేసి, ప్రక్రియ పూర్తి చేసిన వారికి ఓటరు గుర్తింపు ప్రొసీడింగ్స్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ, గుంటూరు ఆర్డీఓ కె. శ్రీనివాసరావు, జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి ఇ. వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# నగరాలు, పట్టణాల్లో నో డంపింగ్‌యార్డులు

- **రూ.529 కోట్లతో వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలు**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత దిశగా అడుగులు పడుతున్నాయి. డంపింగ్ యార్డు రహితంగా నగరాలు, పట్టణాలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఇళ్లు, దుకాణాల్లో సేకరించిన వ్యర్థాలను ఇకపై ఎక్కడపడితే అక్కడ పారేయరు. వాటిని నేరుగా ఆధునిక ప్రాసెసింగ్ కేంద్రాలకు తరలించేలా నూతన విధానాన్ని అమలు చేయనున్నారు.

**డిసెంబరు నాటికి 107 కేంద్రాలు :** పట్టణాల్లో చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా రాష్ట్రవ్యాప్తంగా 107 'ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాల'ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. వీటిలో 20 కేంద్రాలు ఈ నెలాఖరులోగా ప్రారంభం కానున్నాయి. మిగతా కేంద్రాలను ఈ ఏడాది డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నారు. రోజూ సుమారు 5,300 టన్నుల వ్యర్థాలను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో ఈ కేంద్రాలను నిర్మిస్తున్నారు. వీటి ఏర్పాటుకు ప్రభుత్వం రూ.529 కోట్లు ఖర్చు చేస్తోంది. వ్యర్థాల నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేసే మరో ఆరు ప్లాంట్లను కూడా ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో ప్రారంభించేలా అధికారులు వేగంగా చర్యలు తీసుకుంటున్నారు.

**తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువులు :** కొత్తగా ఏర్పాటయ్యే ప్రాసెసింగ్ కేంద్రాల్లో తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేస్తారు. ఏటా 3 లక్షల టన్నుల ఎరువును ఉత్పత్తి చేయాలన్నది ప్రభుత్వ ప్రణాళిక. ఇలా తయారైన ఎరువులను మార్క్‌ఫెడ్‌కు సరఫరా చేస్తారు. ఇందుకు సంబంధించి స్వచ్ఛాంధ్ర సంస్థ ఇటీవల మార్క్ ఫెడ్ తో ఒక ఒప్పందం కూడా కుదుర్చుకుంది.

**పొడి చెత్త పునర్వినియోగం :** రోజూ సుమారు 2,434 టన్నుల పొడి చెత్త ఈ ప్రాసెసింగ్ కేంద్రాలకు రానుంది. ప్లాస్టిక్ వస్తువులు, ఇ–వేస్ట్ తదితర పొడి చెత్తను పునర్వినియోగం (రీసైక్లింగ్) కోసం పలు సంస్థలకు సరఫరా చేస్తారు. తడి, పొడి వ్యర్థాలను ప్రాసెస్ చేయగా మిగిలిన జడ వ్యర్థాలకు కూడా శాస్త్రీయ పరిష్కారం చూపుతారు. మట్టి, ఇటుక, కాంక్రీట్, టైల్స్ ముక్కల వంటి వ్యర్థాలను శాస్త్రీయ విధానంలో భూమిలో కలిసేలా ఏర్పాట్లు చేస్తారు. ప్రాసెస్ కేంద్రాల్లో వ్యర్థాల నుంచి తయారుచేసే ఇంధనాన్ని (ఆర్‌డీఎఫ్) నేరుగా సిమెంట్ ఫ్యాక్టరీలకు తరలిస్తారు.

**ఆరు నగరాల్లో విద్యుత్ ప్లాంట్లు :** ఈ ఫ్రెష్ వేస్ట్ కేంద్రాల నిర్వహణ బాధ్యతను ఆయా పుర, నగరపాలక సంస్థలు తీసుకుంటాయి. ఇందుకు గాను టన్ను చెత్తకు రూ.550 చొప్పున స్థానిక సంస్థలు చెల్లించాల్సి ఉంటుంది. ప్లాంట్ల ఏర్పాటుకు అయ్యే నిధులను స్వచ్ఛాంధ్ర సంస్థ సమకూర్చుతోంది.

## జూలై 14లోగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించాలి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలు అందుకున్న ఓటర్లు వాటిని పూర్తిగా నింపి జూలై 14లోగా సంబంధిత బీఎల్‌వోలకు అందజేయాలని నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి కె. మయూర్ అశోక్ కోరారు.

సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో మొత్తం 2,52,062 మంది ఓటర్లకు గాను 2,50,498 ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయడం ద్వారా 99.38 శాతం ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. ఇప్పటివరకు 1,23,005 ఫారాలను డిజిటలైజ్ చేసినట్లు పేర్కొన్నారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 2,78,555 మంది ఓటర్లకు గాను 2,76,401 ఫారాలను పంపిణీ చేసి 99.23 శాతం లక్ష్యాన్ని చేరుకున్నామని తెలిపారు. వీటిలో 1,23,445 ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని పేర్కొన్నారు. మిగిలిన ఓటర్లు కూడా ఎన్యూమరేషన్ ఫారాలను త్వరగా పూర్తి చేసి బీఎల్‌వోలకు అందజేసి ప్రత్యేక సవరణ ప్రక్రియ విజయవంతం చేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## అమరావతి ఛాంపియన్‌షిప్-2026 పోస్టర్ ఆవిష్కరణ




- **జూలై 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా క్రీడా పోటీలు**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న అమరావతి ఛాంపియన్‌షిప్–2026 క్రీడా పోటీల పోస్టర్‌ను జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రాజ్ ఖాన్ పోస్టర్‌ను విడుదల చేశారు.

దేశ హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినమైన ఆగస్టు 29ను కేంద్ర ప్రభుత్వం జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహిస్తున్న సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో ఈ ఏడాది కూడా అమరావతి ఛాంపియన్‌షిప్–2026 నిర్వహించనున్నారు.

జూలై 15 నుంచి ఆగస్టు 26 వరకు నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## ఏపీలో కాగ్నిజెంట్..

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ రంగాన్ని పరుగులు పెట్టించే కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రముఖ టెక్నాలజీ సంస్థ కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్.. విశాఖపట్నంలో ఐటీ/ఐటీఈఎస్ ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక అనుమతులు పొందింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ జూన్ 25నే తుది నోటిఫై చేసింది.

విశాఖపట్నం రూరల్ మండలం పరిధిలోని ఐటీ–మధురవాడ–2 ప్రాంతంలో 8.98 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ సెజ్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి జూన్ 11న కాగ్నిజెంట్ సంస్థకు లెటర్ ఆఫ్ అప్రూవల్ కూడా జారీ అయింది. సెజ్ చట్టం ప్రకారం డెవలప్‌మెంట్ కమిషనర్ నేతృత్వంలో ఒక అప్రూవల్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. కస్టమ్స్ కార్యకలాపాలను సులభతరం చేసేందుకు ఈ సెజ్‌ను 'ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపో'గా కూడా ప్రకటించడం విశేషం.

# దేశ సమైక్యతకు జీవితాన్ని అంకితం చేసిన శ్యామా ప్రసాద్ ముఖర్జీ : వై.వి. సుబ్బారావు

భారత రాజకీయ చరిత్రలో దేశ ప్రయోజనాలను వ్యక్తిగత ప్రయోజనాల కంటే ఉన్నతంగా భావించిన నాయకుల్లో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ప్రముఖులు. విద్యావేత్తగా, ఆలోచనాపరుడిగా, రాజకీయవేత్తగా ఆయన చేసిన సేవలు భారత రాజకీయాలపై విశిష్ట ముద్ర వేశాయి. 1901 జూలై 6న బెంగాల్‌లో జన్మించిన ఆయన చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభ కనబరిచి, కలకత్తా విశ్వవిద్యాలయానికి అతి పిన్న వయసులో ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించారు. విద్య ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమనే విశ్వాసంతో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు.


స్వాతంత్ర్యం అనంతరం కేంద్ర మంత్రివర్గంలో సభ్యుడిగా పనిచేసిన ముఖర్జీ, దేశ సమైక్యత విషయంలో రాజీపడని నాయకుడిగా గుర్తింపు పొందారు. దేశమంతటికీ ఒకే రాజ్యాంగం, ఒకే జాతీయ పతాకం, ఒకే సార్వభౌమాధికారం ఉండాలనే భావజాలాన్ని బలంగా ప్రతిపాదించారు. జమ్మూ–కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన విధానాలను వ్యతిరేకిస్తూ ఆయన చేపట్టిన ఉద్యమం దేశ రాజకీయ చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచింది.

1951లో భారతీయ జనసంఘ్‌ను స్థాపించి ప్రత్యామ్నాయ రాజకీయాలకు పునాది వేశారు. జాతీయవాదం, సాంస్కృతిక విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి ఆధారంగా దేశ రాజకీయాలకు కొత్త దిశను చూపించారు. అనంతరం అదే జనసంఘ్ భారతీయ జనతా పార్టీగా రూపాంతరం చెంది జాతీయ రాజకీయాల్లో ప్రధాన శక్తిగా ఎదిగింది.

డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవితం పదవుల కోసం కాకుండా సిద్ధాంతాల కోసం సాగిన ప్రయాణంగా నిలిచింది. దేశ సమగ్రత, జాతీయ గౌరవం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఆయన చేసిన కృషి నేటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. దేశభక్తి అంటే దేశ ప్రయోజనాల కోసం నిబద్ధతతో పనిచేయడమేనని, ప్రజాసేవ అంటే బాధ్యత అని ఆయన తన జీవితంతో చాటిచెప్పారు.

డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆయన దేశసేవ, జాతీయ సమైక్యత, ప్రజాస్వామ్య విలువలకు చేసిన సేవలను స్మరించుకోవడం, ఆ ఆదర్శాలను ఆచరణలోకి తీసుకురావడం ఆయనకు అందించే నిజమైన నివాళి.

రచన:
వై.వి. సుబ్బారావు
ఎంబీఏ, ఎంఏ
(జర్నలిజం)



# ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది

- కుత్బుల్లాపూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్, జూలై 06 (జర్నలిస్ట్ ఫైల్) : ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని కుత్బుల్లాపూర్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో గల శ్రీశ్రీశ్రీ బీరప్ప ఆలయ ప్రాంగణంలో మల్టీపర్పస్ హాల్ పునర్నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.1.02 కోట్ల నిధులను మంజూరు చేసింది. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి సహకారంతో నిధులు మంజూరు కావడం పట్ల ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఆదివారం హనుమంత్ రెడ్డి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ "శ్రీశ్రీశ్రీ బీరప్ప ఆలయ మల్టీపర్పస్ హాల్ పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.02 కోట్ల నిధులు మంజూరు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ నిధుల మంజూరుకు సహకరించిన రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన సహకారం నిరంతరం అందిస్తాం" అని అన్నారు.ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్లు కే.యం గౌరీష్, బట్ట పాల కృష్ణ,సీనియర్ నాయకులు దమ్మని శ్రవణ్, డివిజన్ అధ్యక్షులు సిద్దనోల సంజీవరెడ్డి,మైసిగారి శ్రీనివాస్, పిట్ల ప్రవీణ్ ముదిరాజ్, కుత్బుల్లాపూర్ కురుమ సంగం చైర్మన్, బి. నరసింహ తదితరులు పాల్గొన్నారు.



- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ పై అవగాహన సదస్సు

ప్రగతి నగర్ 276వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం కావాలంటే బిఎల్ఏలు కీలక పాత్ర పోషించాలన్నారు.ప్రతి బూత్ స్థాయిలో సమర్థవంతంగా పనిచేస్తూ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.పార్టీలో నిబద్ధతతో, కష్టపడి పనిచేసే కార్యకర్తలకే తగిన గుర్తింపు లభిస్తుందని చెప్పారు.ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రగతి నగర్ 276వ డివిజన్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి (తాతిరెడ్డి), బాచుపల్లి డివిజన్ అధ్యక్షులు కొలన్ జీవన్ రెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మౌళేశ్వర్ రావు,స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# నాడు ఎస్ఎఫ్ఐ నాయకుడు.. నేడు తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు

- కాకి రంగరాజ్‌కు వికారాబాద్ ప్రజా సంఘాలు, పూర్వ విద్యార్థుల ఘన సన్మానం



వికారాబాద్, జూలై 06 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా నియమితులైన కే. రంగరాజ్ కి వికారాబాద్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ప్రతినిధులు, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు, పూర్వ విద్యార్థులు, వివిధ రాజకీయ, సామాజిక సంస్థల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, నాడు ఎస్ఎఫ్ఐ నాయకుడిగా విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడిన కే. రంగరాజ్ నేడు తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టడం వికారాబాద్ జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించి, సామాజిక సేవలో తనదైన ముద్ర వేసిన రంగరాజ్‌కు ఈ పదవి రావడం ఆయన చేసిన కృషికి గుర్తింపని కొనియాడారు.ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజలతో మమేకమై పనిచేసిన ఆయన, కొత్త బాధ్యతల్లో కూడా రాష్ట్ర అభివృద్ధికి, స్థానిక సంస్థల బలోపేతానికి విశేషంగా కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థి ఉద్యమాల నుంచి ప్రజా జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవడం యువతకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు కే.రంగరాజ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి అభినందనలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్, ఎస్ఎఫ్ఐ నాయకుడు అక్బర్, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు డి. లక్ష్మణ్, నవ తెలంగాణ రిపోర్టర్ వెంకట్‌రామ్ రెడ్డి, ఏఐకేఎంఎస్ నాయకుడు మహేందర్, డీవైఎఫ్ఐ నాయకుడు సతీశ్, మీడియా టుడే ప్రతినిధి చందు, శ్రీ అనంత పద్మనాభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పూర్వ విద్యార్థులు, ఫెరోజ్, గోపాల్, యాదగిరి, వికాస్, జిలానీ, ప్రవీణ్, శివ, రాకేష్, నర్సింహులు, అరవింద్, నవీన్, బుజ్జి, శంకర్, రమేష్ తదితరులు పాల్గొని కే. రంగరాజ్‌ను అభినందించారు.

# మహిళా ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్



మణికొండ జూలై 06 (జర్నలిస్ట్ ఫైల్) : మణికొండ నెక్నాంపూర్, అల్కాపూర్ టౌన్‌షిప్ రోడ్ నెం. 24లో నూతనంగా ఏర్పాటు చేసిన "హెర్‌స్పేస్ క్లినిక్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ హాజరయ్యారు అనంతరం ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం మరియు సంతానలేమి (ఫెర్టిలిటీ) సమస్యలకు మెరుగైన, అధునాతన వైద్య సేవలు అందించే లక్ష్యంతో ప్రముఖ గైనకాలజిస్ట్ మరియు ఇన్ఫెర్టిలిటీ స్పెషలిస్టులు డాక్టర్ కె. మాధవీ లత మరియు డాక్టర్ ఉమా మహేశ్వరి కాసిరెడ్డి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం చాలా చాలా శుభ పరిమాణం అని ఎంతో మంది మహిళలకు ఈ యొక్క క్లినిక్ అందుబాటులో ఉండి నాణ్యతమైన ఆరోగ్యం కోసం మహిళలకు సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమములో మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి. తలారి మల్లేష్. ముంగి జైపాల్ రెడ్డి. వేణు గౌడ్. అశోక్ యాదవ్. గొర్ల వెంకటేష్ యాదవ్. బుద్దోలు శ్రీరాములు . మార్కెట్ డైరెక్టర్ ఎరుపుల కుమార్. తదితరులు పాల్గొన్నారు.

# ఆలయా దర్శనంతో మానసిక ప్రశాంతత చేకూరుతుంది

- బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కొలుకుల జైహింద్



కుత్బుల్లాపూర్, జూలై 06 (జర్నలిస్ట్ ఫైల్) : ఆలయ దర్శనంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కొలుకుల జైహింద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సంజయ్ పూరి కాలనీలో పోచమ్మ దేవాలయం పునర్నిర్మాణ విగ్రహ ప్రతిష్టాపన అమ్మవారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జైహింద్ ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మల్లేష్ గౌడ్, తరుణ్ రెడ్డి,ప్రవీణ్ గుప్తా,అప్పల శ్రీను,శ్రీకాంత్ రెడ్డి,రాజ్ కుమార్, పాపిరెడ్డి,కిషోర్,ఆంజనేయులు, బాలు,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# తార్నాక స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డా. శ్రీరామ్ వెంకటేష్

- ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతాం
- 20 ఏళ్ల నిర్లక్ష్యాన్ని తొలగించి పార్కుకు కొత్త రూపు తెస్తాం
- కాలనీ అభివృద్ధికి కార్యాచరణ ప్రారంభించిన నూతన కమిటీ





సికింద్రాబాద్, జూలై 06 (జర్నలిస్ట్ ఫైల్) : తార్నాక స్ట్రీట్ నెం.3 వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రముఖ సామాజిక సేవకుడు,బీజేపీ నాయకుడు డా.శ్రీరామ్ వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కాలనీలోని సుమారు 280 ఇళ్లు,అపార్ట్‌మెంట్లు,వాణిజ్య సంస్థలు, ఆసుపత్రులు, విద్యాసంస్థల ప్రతినిధులు,కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన అనంతరం కాలనీ సమగ్రాభివృద్ధికి కార్యాచరణ ప్రారంభించామన్నారు.గత రెండు దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురై అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన పార్కును తన సొంత నిధులతో అభివృద్ధి చేసి,ఆయుర్వేద పార్క్‌గా తీర్చిదిద్దను న్నట్లు ప్రకటించారు.కాలనీ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు"కాలనీ సమస్యల డ్రాప్ బాక్స్" ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.తాగునీరు,డ్రైనేజీ, విద్యుత్,వీధి దీపాలు,పారిశుద్ధ్యం,భద్రత తదితర సమస్యలను కాలనీ వాసులు లిఖితపూర్వకంగా నమోదు చేయవచ్చని,వాటిని సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పరిష్కరించేందుకు అసోసియేషన్ కృషి చేస్తుందని చెప్పారు.అభివృద్ధి కార్యక్రమాలు,సమస్యల పరిష్కారం,భవిష్యత్ కార్యాచరణపై కాలనీ ప్రజలకు నిరంతరం సమాచారం అందించేందుకు ప్రతి నెలా "కాలనీ న్యూస్ లెటర్"ను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.నూతన కార్యవర్గం అధ్యక్షుడు డా. శ్రీరామ్ వెంకటేష్,ఉపాధ్యక్షుడు అడ్వకేట్ శ్రీనివాస్,సంయుక్త కార్యదర్శులు మధు,మహ్మద్ అస్లాం పాషా,ఖజాంచి,వెంకట సుబ్బారావు,కార్యవర్గ సభ్యులు జాయ్,మెర్సీ.ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ,డా. శ్రీరామ్ వెంకటేష్ నాయకత్వంలో తార్నాక స్ట్రీట్ నెం.3 ఆదర్శ కాలనీగా అభివృద్ధి చెందుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

# అనంతగిరి మార్గంలో అదుపుతప్పి పంట పొలంలోకి దూసుకెళ్లిన కారు!

- శని, ఆదివారాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు పెంచాలని స్థానికుల విజ్ఞప్తి



వికారాబాద్, జూలై 06 (జర్నలిస్ట్ ఫైల్) : శని ఆదివారాలు వేలాది మంది పర్యాటకులు అనంతగిరి కొండలు, కోటిపల్లి ప్రాజెక్టుకు తరలివస్తుండటంతో వికారాబాద్ అనంతగిరి రహ దారిపై వాహనాల రద్దీ భారీగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్ నుంచి అనంతగిరి, కోటిపల్లి ప్రాజెక్టు వైపు వెళ్తున్న ఓ కారు ధరూర్ మండల్ బాచారం సమీపంలోని ప్రమాదకర మూల మలుపు వద్ద అదుపుతప్పి పంట పొలంలోకి దూసుకెళ్లింది.ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారికి అదృష్టవశాత్తు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదాన్ని గమనించిన పొలాల్లో పనిచేస్తున్న రైతులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ట్రాక్టర్ సహాయంతో కారును బయటికి తీశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.స్థానికుల కథనం ప్రకారం, బాచారం గ్రామ సమీపంలో మూల మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయని, ప్రభుత్వ సెలవు దినాల లో వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. శని, ఆదివారాల్లో అనంతగిరి, కోటిపల్లి ప్రాజెక్టు వైపు వెళ్లే మార్గాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందని, పర్యాటకుల భద్రతతో పాటు స్థానిక ప్రజల ప్రాణాలను కాపాడేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, పోలీసు పర్యవేక్షణ పెంచితే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# జులై 7న ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఎగరేయాలి

- వర్గీకరణ అవకాశాలను మాదిగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ రాగళ్ల ఉపేందర్ మాదిగ



కడ్తాల్ జూలై 06 (జర్నలిస్ట్ ఫైల్) : దేశంలో సామాజిక న్యాయం కోసం మూడు దశాబ్దాలకు పైగా నిరంతర పోరాటం సాగించి తన లక్ష్యాన్ని సాధించిన అరుదైన ఉద్యమంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) నిలిచిందని ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి రాగళ్ల ఉపేందర్ మాదిగ పేర్కొన్నారు.ఎమ్మార్పీఎస్ ఉద్యమం కేవలం మాదిగల హక్కులకే పరిమితం కాకుండా సమాజంలోని అన్ని పీడిత,అణగారిన వర్గాల సంక్షేమం కోసం కూడా పోరాడిందని ఆయన అన్నారు.ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని జులై 7న ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిస్తూ కడ్తాల్ మండల కేంద్రం లో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.కడ్తాల్ మండల అధ్యక్షుడు అబ్బు రమేష్ మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి పూలె కిరణ్ మాదిగతో కలిసి పాల్గొన్న ఆయన,ఎమ్మార్పీఎస్ సాధించిన విజయాలను కార్యకర్తలకు వివరించారు. ఆరోగ్యశ్రీ,వృద్ధాప్య,వికలాంగులు,వితంతువుల పెన్షన్లు,రేషన్ బియ్యం పెంపు,ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు వంటి అనేక ప్రజా సమస్యలపై ఎమ్మార్పీఎస్ ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన ఎస్సీ రిజర్వేషన్లు జనాభా ప్రాతిపదికన అమలు కాకపోవడంతో మాదిగలు విద్య, ఉద్యోగాల్లో వెనుకబడ్డారని,ఈ పరిస్థితిని మార్చేందుకు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సాగిన దీర్ఘకాల ఉద్యమ ఫలితంగానే తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలై మాదిగలకు 9 శాతం రిజర్వేషన్ లభించిందని పేర్కొన్నారు.ఈ అవకాశాలను మాదిగ విద్యార్థులు, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని,ఉన్నత విద్య,పోటీ పరీక్షలు, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించి అన్ని రంగాల్లో ముందుకు రావాలని ఆయన సూచించారు.జులై 7న జరిగే ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో పండుగ వాతావరణంలో నిర్వహించాలని,మాదిగల ఆత్మగౌరవ ప్రతీక అయిన ఎమ్మార్పీఎస్ జెండాను ప్రతి గ్రామంలో ఎగురవేయాలని పిలుపునిచ్చారు.అలాగే ఉద్యమానికి సహకరించిన అన్ని కులాలు, వర్గాల ప్రజలను కార్యక్రమాలకు ఆహ్వానించి, ఎమ్మార్పీఎస్ సాధించిన విజయాలు,విద్య ప్రాధాన్యత,సామాజిక చైతన్యంపై అవగాహన కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు పోతుగంటి కృష్ణ మాదిగ,కంబాలపల్లి శ్రీకాంత్ మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి శ్రీకాంత్ మాదిగ,శ్రీను మాదిగ,రాజు మాదిగ,శేఖర్ మాదిగతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి





మేడ్చల్ జూలై 06 (జర్నలిస్ట్ ఫైల్) : సైబరాబాద్ మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధిలోని మేడ్చల్ సర్కిల్ కిష్టాపూర్ పూడూర్ డివిజన్ కిష్టాపూర్ అర్చన కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా ఆదివారం శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని చండి ఉపాసకులు బ్రహ్మశ్రీ సంజయ్ శర్మ వైదిక బృందంతో ఆదివారం ఉదయాత్ పూర్వము బ్రాహ్మి ముహూర్తం 3:30గంటల నుండి కర్మణః పుణ్యాహ వాచనం, గర్తన్యాసం, బీజన్యాసం, ధాతున్యాసం, 4:50 గంటలకు యంత్రస్థాపన నల్లపోచమ్మ పరివార, విగ్రహాల ప్రతిష్ట ప్రాణప్రతిష్ట దృక్ బలి, దిక్ బలి, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన సంప్రోక్షణ, శాంతి కళ్యాణం మహానైవేద్యం హారతి మంత్రపుష్పం ఆశీర్వచనం పండిత సన్మాన కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం 12 నుండి అన్న ప్రసాద సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, మాజీ మంత్రి మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి మాజీ డిసిసి అధ్యక్షులు సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్, మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోమారం బాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ డివిజన్ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు, చెరువుకొమ్ము శేఖర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ దేవ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, మేడ్చల్ మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు ఆకిటి నవీన్ రెడ్డి, దయానంద్ యాదవ్, మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్, మోహన్ రెడ్డి, నర్సింగ్ రావు, భారతీయ జనతా పార్టీ మేడ్చల్ అధ్యక్షురాలు జల్లి శైలజా హరినాథ్, బి జే పి మేడ్చల్ మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్ దోసడి రామచంద్రా రెడ్డి, బి జె పి నాయకులు అర్జున్, గామిడి మధుసూదన్ రెడ్డి, మహిళలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్షుడికి షోకాజ్ నోటీసులు ఇచ్చే అధికారం లేదు

- క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ను సంప్రదిస్తా : మాజీ సర్పంచ్ భేరి ఈశ్వర్



మేడ్చల్ జూలై 06 (జర్నలిస్ట్ ఫైల్) : తనకు షోకాజ్ నోటీసులు జారీ చేసే అధికారం మేడ్చల్ నియోజకవర్గ డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్‌కు లేదని గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ భేరి ఈశ్వర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అంతర్గత అంశాలను కొందరు సోషల్ మీడియాలో వైరల్ చేసిన విషయాన్ని ఫోన్ ద్వారా జంగయ్య యాదవ్ దృష్టికి తీసుకెళ్లానని, అంతే తప్ప పీసీసీ లేదా డీసీసీ నాయకత్వంపై ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని ఆయన స్పష్టం చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లేఖను బయటకు తీసుకువచ్చిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పిన జంగయ్య యాదవ్ దళితుడినైన తనకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం సరైన విధానం కాదని భేరి ఈశ్వర్ విమర్శించారు. కొందరు తప్పు చేసినప్పటికీ తనను లక్ష్యంగా చేసుకుని నోటీసులు జారీ చేసి భయపెట్టే ప్రయత్నాలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. డీసీసీ జారీ చేసిన షోకాజ్ నోటీసుల అంశాన్ని కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ ముందుకు తీసుకెళ్లి అక్కడే తేల్చుకుంటానని భేరి ఈశ్వర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు గువ్వ రవి ముదిరాజ్,గుండ్ల పోచంపల్లి డివిజన్ అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్, మహిళ నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నల్ల పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న రామన్నగారి రాఘవేందర్ గౌడ్



మేడ్చల్ జూలై 06 (జర్నలిస్ట్ ఫైల్): సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కిష్టాపూర్ పూడూర్ డివిజన్ పరిధిలోని అర్చన కాలనీలో శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా జరిగింది.ఆదివారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ రామన్నగారి రాఘవేందర్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు, ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ సభ్యులు,అర్చన కాలనీ సభ్యులు శాలువా కప్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు కమలాకర్ రెడ్డి,సుధాకర్ చారి,జనార్ధన్ రెడ్డి,మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తొంట యాదయ్య,వేముల నాగిరెడ్డి,రంజిత్ రెడ్డి,తొంట సుధాకర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువకులు మహిళలు పాల్గొన్నారు.

# సర్ -2026 కార్యక్రమంలో ఎన్యూమరేషన్ ప్రక్రియను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య

**ఖమ్మం (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం మున్సిపల్ పరిధిలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సర్ -2026 కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఎన్యూమరేషన్ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియలను పరిశీలించి, ప్రతి దశ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా జరుగుతున్నాయా లేదా అనే విషయాన్ని సమీక్షించారు. ఫారాలు నింపే సమయంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, సేకరించిన సమాచారాన్ని యాప్‌లో అప్లోడ్ చేసే సమయంలో కూడా పూర్తి ఖచ్చితత్వం పాటించాలని అధికారులను ఆదేశించారు.ఫారాల్లో లోపాలు లేదా అసంపూర్ణ వివరాలు గుర్తించిన వెంటనే వాటిని సరిదిద్దించి, సరైన సమాచారంతోనే యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి ఓటరు వివరాలు తప్పులు లేకుండా నమోదు చేయడం ప్రతి అధికారి బాధ్యత అని పేర్కొన్నారు.ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, మ్యాపింగ్, డిజిటలైజేషన్, యాప్‌లో డేటా అప్లోడ్ ప్రక్రియలో ఎలాంటి అలసత్వం, చిన్నపాటి నిర్లక్ష్యాన్ని కూడా ఉపేక్షించబోమని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. తదనంతరం కమిషనర్ అభిషేక్ అగస్త్య ఫ్రీడమ్ పార్క్, ఎన్ఎస్‌పీ పార్క్‌ను సందర్శించి అక్కడ చేపట్టాల్సిన మొక్కల నాటడం, పార్కుల పునరుద్ధరణ (రెనోవేషన్) పనులను పరిశీలించారు. పార్కుల అభివృద్ధికి అవసరమైన వసతులు, చేపట్టాల్సిన పనులపై





సమగ్ర అంచనాలతో ఎస్టిమేట్ సిద్ధం చేసి వెంటనే తనకు సమర్పించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

# ట్రాన్స్మిషన్ అసెస్‌మెంట్ సర్వేకు సహకరించండి

**: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. రామారావు**

**కొత్తకూడెం, జూలై 06 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఫైలేరియా వ్యాధి నిర్మూలనలో భాగంగా రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయం, హైదరాబాద్ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లాలో ట్రాన్స్మిషన్ అసెస్‌మెంట్ సర్వే (టి.ఏ.ఎస్.) ను ఈ నెల 06-07-2026 నుండి 18-07-2026 వరకు నిర్వహించ నున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. రామారావు తెలిపారు. ఈ సర్వే జిల్లాలోని గంగారం, లంకసాగర్, వేంసూర్, తల్లాడ, ఏన్కూరు , కల్లూరు, చెన్నూరు, బోనకల్, బనిగండ్లపాడు, మాటూరిపేట, దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గుర్తించిన 31 గ్రామాలలో నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన గ్రామాలలోని గుర్తించిన గృహాలను సందర్శించి, 20 సంవత్సరాలు నిండిన వ్యక్తులకు పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతి గ్రామంలో సుమారు 105 మంది అర్హులైన వ్యక్తులకు పరీక్షలు చేసి ఫైలేరియా వ్యాధి సోకిందా లేదా అనే విషయాన్ని నిర్ధారిస్తారు. సర్వే సందర్భంగా ఎంపిక చేసిన ఇంటిలోని అర్హులైన కుటుంబ సభ్యులందరికీ పరీక్షలు నిర్వహించబడతాయి.సర్వేలో ఫైలేరియా వ్యాధి నిర్ధారణ అయిన వారికి వెంటనే తగిన చికిత్స అందించడంతో పాటు, వారి నివాస ప్రాంతం, పరిసర ప్రాంతాల్లో దోమల నియంత్రణ చర్యల్లో భాగంగా ప్రత్యేక స్ప్రేయింగ్ కార్యక్రమం కూడా చేపడతామని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి తెలిపారు. ఫైలేరియా నిర్మూలన లక్ష్యాన్ని విజయవంతం చేయాలంటే



ప్రజల సహకారం ఎంతో అవసరమని, సర్వే బృందాలు గృహాలను సందర్శించినప్పుడు పరీక్షలకు సహకరించాలని, ఎలాంటి అపోహలకు తావు ఇవ్వకుండా ఆరోగ్య సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ప్రజల భాగస్వామ్యంతోనే ఫైలేరియా రహిత ఖమ్మం జిల్లాను నిర్మించగలమని, అందరూ బాధ్యతగా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమానికి సహకరించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు కోరారు.

# కొత్తగూడెంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ ఏర్పాటు పనులు వేగవంతం చేయాలని డిమాండ్ చేసిన ఎం పి వద్దిరాజు రవిచంద్ర

**ఖమ్మం, జూలై 06 (జర్నలిస్ట్ ఫైల్) :**

కొత్తగూడెం జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు ముందడుగు పడడం పట్ల బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర హర్షం వ్యక్తంచేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత గురించి గతంలో ఆయన పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేయడం జరిగింది. తెలంగాణలో ఒక శంషాబాద్ నుంచి మాత్రమే విమానాల రాకపోకలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. దీనికి కొత్తగూడెం సుమారు 300 కిలో మీటర్ల దూరంలో ఉండడం, సింగరేణి బొగ్గు గనులు విస్తారంగా నెలకొనడం, భద్రాద్రి శ్రీసీతారామ చంద్రస్వామి కొలువైన ఈ ప్రాంతంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ గురించి ఎంపీ రవిచంద్ర రాజ్యసభలో లేవనెత్తడం,కేంద్ర ప్రభుత్వానికి,పౌర విమానయాన శాఖ మంత్రి రాంమోహన్ నాయుడుకు నివేదించడం విదితమే. ఈ నేపథ్యంలో విమానాశ్రయం ఏర్పాటుకు అనుకూలమైన స్థలం ఎంపిక బాధ్యతను "రాజ్ టెక్నాలజీస్"కు కేంద్ర ప్రభుత్వం అప్పగించడం జరిగింది.గతంలో పాల్వంచ,దాని చుట్టుపక్కల పలు చోట్ల సర్వే జరిగినా విమానాల రాకపోకలకు అనువైన స్థలాన్ని గుర్తించడం జరుగలేదు.తాజాగా "రాజ్ టెక్నాలజీస్"సంస్థ క్షుణ్ణంగా పరిశీలించి,సర్వే చేసి గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి జిల్లా కేంద్రం సమీపాన ఉన్న సుజాతానగర్-సీతంపేట పరిసరాలు అనుకూలమైనవని నిర్ధారించారు.ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు స్పందిస్తూ హర్షామోదాలు వ్యక్తం చేశారు, హృదయపూర్వకంగా స్వాగతించారు.కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని,ఆవశ్యకతను కేంద్ర ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తాను తెచ్చిన అంశాలను ఎంపీ రవిచంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్ ఘడ్,ఒడిషా రాష్ట్రాలు సరిహద్దు కలిగి ఉన్న ప్రధాన గమ్యస్థానం అని చెప్పారు."దక్షిణ గంగా" నదిగా పిలుచుకునే గోదావరి ఒడ్డున "దక్షిణ అయోధ్య"గా పేరొందిన భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి కొలువైన దివ్యక్షేత్రాన్ని, పర్ణశాలను ప్రతినిత్యం వేలాది మంది భక్తులు సందర్శించడం... సింగరేణి బొగ్గు



గనులు విస్తారంగా ఉన్నాయని,జిల్లా కేంద్రం కొత్తగూడెంలో దాని ప్రధాన కార్యాలయం నెలకొని ఉందన్నారు.అలాగే,ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ,నవభారత్,ఐటీసీ,కేటీపీఎస్,బీపీటీఎస్,హెవీ వాటర్ ప్లాంట్, కిన్నెరసాని ప్రాజెక్ట్ ఉండడం తదితర అంశాలను ఎంపీ రవిచంద్ర ప్రస్తావించారు.ఈ సానుకూలమైన అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన అన్ని అనుమతులు త్వరితగతిన మంజూరుతో పాటుగా మామునూరు, ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుల పనులను మరింత వేగవంతం చేయాల్సిందిగా మంత్రి రాంమోహన్ నాయుడును ఆయన కోరారు.అదేవిధంగా ఖమ్మం-కొత్తగూడెం-పాల్వంచ-భద్రాచలం రోడ్డును ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని బస్తర్, మరోవైపు ఒడిషాలోని మల్కన్ గిరి వరకు 4 లైన్లుగా విస్తరించాలని, కొత్తగూడెం రైల్వే స్టేషన్ ఏర్పాటై 2032 నాటికి 100 ఏండ్లు పూర్తి కావస్తుండడంతో డివిజన్ కేంద్రంగా ప్రకటిస్తూ భద్రాచలం మీదుగా ఛత్తీస్ ఘడ్, ఒడిషాల వరకు మార్గాన్ని పొడగించాలని ఎంపీ రవిచంద్ర కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఇటీవల నగర పాలక సంస్థగా అవతరించిన కొత్తగూడెం రోడ్డు విస్తరణ, రైల్వే డివిజన్ ఏర్పాటు, రైల్వే మార్గం పొడిగింపు, విమానాశ్రయం నిర్మాణంతో ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్ ఘడ్, ఒడిషా రాష్ట్రాలలోని సరిహద్దు జిల్లాలకు ముఖ్యమైన గమ్యస్థానమై ఆధ్యాత్మికంగా,వ్యాపార,వాణిజ్య, పారిశ్రామిక,పర్యాటక రంగాలలో అద్భుతంగా అభివృద్ధి చెందుతుందని ఎంపీ వద్దిరాజు ఆశాభావం వ్యక్తంచేశారు.

# అంగరంగ వైభవంగా విగ్రహా ప్రతిష్ట మహోత్సవం



**నేలకొండపల్లి, జూలై 06 (జర్నలిస్ట్ ఫైల్) :**

మండలం లోని బోదులబండ లో ఆదివారం నిర్వహించిన ముత్యాలమ్మ విగ్రహా ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర రెవిన్యూ, గృహా నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు.నిర్వహించారు. నిర్వహాకులు' ఏర్పాటు చేసిన అన్నదానం ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు ప్రజల మధ్య ఐక్యత ను పెంపోందిస్తాయని అన్నారు. ఆమ్మ వారి కృపాకటాక్షాలతో ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. సకాలంలో వర్షాలు కురిసి తెలంగాణ ప్రజలు పాడి ' పంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్టెకోల నాగార్జున, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొడాలి గోవిందరావు, జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, బొడ్డు బొందయ్య, జెర్రిపోతుల అంజిని, దండా పుల్లయ్య, దండా నవీన్, దండా నరసింహారావు, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.మండలంలో బోదుల బండ లో జరిగిన ముత్యాలమ్మ విగ్రహా ప్రతిష్ట కార్యక్రమంలో బీజెపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, బీజేవైయం జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్రెడ్డి తదితరులు వేర్వేర్ గా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# యాదవుల ఆధ్వర్యంలో గంగమ్మ తల్లికి బోనాలు.



**ఏన్కూరు, జూలై 06 (జర్నలిస్ట్ ఫైల్) :**

మండల కేంద్రమైన ఏన్కూర్ లో యాదవుల ఆధ్వర్యంలో ఘనంగా గంగమ్మ తల్లికి బోనాల జాతర నిర్వహించారు. తొలిత ఉదయాన్నే గ్రామదేవతలైన ముత్యాలమ్మ, బొడ్రాయి, మైసమ్మ తల్లులకు మహిళలు జలాభిషేకం చేశారు. యాదవులు జాతర సందర్భంగా వర్షాలు బాగా పడాలని, పంటలు సమృద్ధిగా పండాలని ఊరికి ఎలాంటి రోగాలు రాకుండా గంగమ్మ తల్లి కాపాడాలని జరుపుకునే గొప్ప యాదవ సంప్రదాయం అని కొనియాడారు.అత్యంత పవిత్రమైన దైవంగా కొలిచే నిమ్మతల్లి మహిళలు, చిన్నారులు తమ ఇళ్లలో పాలు పొంగించి ప్రసాదం చేసి బోనాలు తయారు చేశారు. అనంతరం గంగమ్మ తల్లికి ప్రభ బండి కట్టి మహిళలు, చిన్నారులు బోనాలు ఎత్తుకొని ముత్యాలమ్మ, బొడ్రాయి, మైసమ్మ తల్లులకు ప్రసాదాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో చీటీ ముత్తయ్య, చీటీ నరసింహారావు, బిక్షపతి, కళ్యాణ్, నాగరాజు, పదిమల వెంకటేశ్వర్లు, వెంకటేష్, బ్రహ్మం, మురళీ కృష్ణ, పాముల నరసింహారావు, యాదవ సంఘం పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.

# సర్ లో జాగ్రత్తలు పాటించాలి : చిరుమామిళ్ళ

**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :**



సర్ లో జాగ్రత్తలు పాటించాలి అని ఖమ్మం నగర పాలక సంస్థ మాజీ తాజా కార్పొరేటర్ చిరు మామిళ్ళ లక్ష్మీ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ పారం నింపే క్రమంలో 1987 తర్వాత పుట్టిన వారు, 2002 ఓటర్ డాటా లేని వారు ఖచ్చితంగా ఒకటో బాక్స్ నింపరాదు అని తెలిపారు. 2002 ఓటర్ డాటా ఉన్నవారు ఎలాంటి ఐడి జిరాక్సులు ఇవ్వాల్సిన అవసరం లేదు అని వివరించారు. డాటా లేని వారు మాత్రమే పారం వెనుక పేర్కొన్న వాటిలో ఏదైన 2002 నాటివి ఐడి జిరాక్సులు ఇవ్వాల్సి ఉంటుంది అని తెలిపారు.

## స్పోకెన్ ఇంగ్లీష్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



**ఖమ్మం, జూలై 06 (జర్నలిస్ట్ ఫైల్) :**
విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లీష్ నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే ఉద్యోగ ,ఉపాధి అవకాశాలు సొంతం అవుతాయని ఇంటర్నేషనల్ స్పోకెన్ ఇంగ్లీష్ నిపుణులు ఎస్ ఎం అరుణ్ తెలిపారు. స్థానిక దూరదర్శన్ కేంద్రం వద్ద ఉన్న కాలేజ్ బాలికల వసతి గృహంలో ఆదివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు తమ కోర్సును పూర్తి చేసుకున్న తర్వాత స్పోకెన్ ఇంగ్లీష్ నైపుణ్యాలు ఉన్నవారికే ప్రథమ ప్రాధాన్యతగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు ఆంగ్ల పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థినిలకు ఏరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హ్యాండ్ వాష్, సోప్ కిట్లను బహుకరించారు. ఏరా ఫౌండేషన్ చైర్మన్ ఫర్హా పరిశుభ్రత అంశాల గురించి ప్రచారంలో భాగంగా విద్యార్థినీలకు ఈ కిట్ లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల నిపుణులు ఎస్ ఎం అరుణ్ , వసతి గృహం హెచ్ డబ్ల్యు ఓ కోమలి , హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు. ఎస్ ఎం అరుణ్ ను హెచ్ డబ్ల్యు ఓ కోమలి, విద్యార్థినీలు ఘనంగా సత్కరించారు.

## రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుడిగా నియామకం పొందిన కాకి రంగరాజ్‌కు ఘన సన్మానం



**వికారాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుడిగా నియామకం పొందిన మాజీ విద్యార్థి నాయకుడు కాకి రంగరాజ్‌కు వికారాబాద్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థి నాయకులు, రాజకీయ నాయకులు, పూర్వ విద్యార్థులు పాల్గొని అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2006 నుంచి 2013 వరకు భారత విద్యార్థి సమాఖ్యలో పనిచేసిన రంగరాజ్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు చేపట్టి సమర్థ నాయకుడిగా ఎదిగారని కొనియాడారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్వాసాన్ని పొందారని తెలిపారు. ఆయనకు రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుడిగా లభించిన బాధ్యత ప్రజాసేవకు గుర్తింపేనని పేర్కొన్నారు.కాకి రంగరాజ్ మాట్లాడుతూ విద్యార్థి దశలో భారత విద్యార్థి సమాఖ్య తన రాజకీయ, సామాజిక జీవితానికి తొలి పునాది వేసిందని అన్నారు. విద్యార్థి ఉద్యమాల ద్వారా సమాజ సమస్యలను అర్థం చేసుకునే అవకాశం లభించిందని చెప్పారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగానని, అదే కృషికి గుర్తింపుగా రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుడిగా అవకాశం లభించిందని పేర్కొన్నారు. ఈ బాధ్యతను ప్రజల సమస్యల పరిష్కారానికి వినియోగిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థి నాయకులు, పూర్వ విద్యార్థులు, మిత్రులు, వివిధ సామాజిక సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాకి రంగరాజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## బోర్డు తిప్పేసిన 'కిసాన్ పరివార్'

**హైదరాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) :** అధిక వడ్డీల పేరిట ఆశ చూపి సామాన్యుల నడ్డి విరిచింది 'కిసాన్ పరివార్' సంస్థ. ఆకర్ష ణీయమైన స్కీమ్లతో వల విసిరి ఏకంగా ఆరు వేల కోట్ల మేర బోర్డు తిప్పేసిన ఈ ఘరానా మోసం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచ లనం సృష్టిస్తోంది. భూపాల్ నాయక్ అనే కేటుగాడు 'కిసాన్ పరివార్', 'షేర్స్ బజార్' అనే వివిధ పేర్లతో సంస్థలను స్థాపించాడు. 2022 నుంచి పెట్టుబడులు పెట్టిన వారికి మొదట్లో ఏడాది పాటు నమ్మకంగా అధిక వడ్డీలు చెల్లించాడు. నమ్మకం కుదిరిన బాధి తులు తమ జీవితకాల సంపాదనను భారీగా ఇన్వెస్ట్ చేయడంతో ప్లాన్ ప్రకారం బోర్డు తిప్పేశాడు. ఈ మెగా స్కామ్ లో దేశవ్యా ప్తంగా సుమారు ఆరు వేల మంది బాధితులు కాగా, కేవలం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే 1,200 మంది మధ్యత రగతి ప్రజలు సర్వస్వం కోల్పోయారు. ఈ భారీ కుంభకోణంపై గుజరాత్ పోలీసులు గతంలోనే నిందితుడు భూపాల్ నాయక్ కు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిన నిందితుడిని శంషా బాద్ పోలీసులు అదుపులోకి తీసుకుని గుజరాత్ పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం ట్రాన్సిట్ వారెంట్పై నిందితుడిని హైదరాబాదు తరలించారు. తమకు జరిగిన అన్యాయంపై శనివారం, ఆదివారం బాధితులు భారీ సంఖ్యలో సైబరాబాద్ సీపీ కార్యాలయానికి తరలివచ్చి ఫిర్యాదు చేశారు.

## మంత్రి వాకిటి శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసిన కేశంపేట కాంగ్రెస్ నాయకులు

**కేశంపేట, (జర్నలిస్ట్ ఫైల్) :** షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర గౌరవ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి గారిని కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్ ఆధ్వర్యంలోని కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి గారికి శాలువాతో ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.సమావేశంలో కేశంపేట మండల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని నాయకులు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ,, ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తోందన్నారు. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు.ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ,, షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. కేశంపేట మండలంలో అభివృద్ధి పనులకు మరింత వేగం పెంచి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ అధ్యక్షుడు రూప్లా నాయక్, బోధ నంపల్లి సర్పంచ్ నగేష్, నిర్ధవెల్లి డిప్యూటీ సర్పంచ్ సాపురా అమీర్, మల్లేష్, నర్సింహా, యాదగిరి తదితర కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని మంత్రి గారిని సత్కరించారు.



## అగ్గిరవ్వను చిన్నచూపు చూడొద్దు

**షాద్నగర్, (జర్నలిస్ట్ ఫైల్) :** సిద్ధాపూర్ డంపింగ్ యార్డు అంశంపై ఎమ్మెల్యేకు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఘాటు హెచ్చరికసిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యవహారంలో ప్రజలను తికమక పెట్టి, మభ్యపెట్టి, ప్రభుత్వం జారీ చేసిన జీవోతో ఇక ఎవరూ ఏమీ చేయలేరనే భ్రమలో అధికార పార్టీ నాయకులు ఉంటే అది పెద్ద పొరపాటని ఆయన అన్నారు. భారతీయ జనతా పార్టీ కొత్తూర్ మండల అధ్యక్షుడు అత్తాపురం మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో★ నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం అగ్గిరవ్వలా ప్రారంభమైన ఈ ఉద్యమం త్వరలోనే అగ్నిజ్వాలగా మారి, ప్రజల ఆకాంక్షలకు ప్రభుత్వం తలవంచే వరకు నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ప్రభుత్వం వెంటనే తన ఉద్దేశాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని, ప్రజల అభిప్రాయాలకు గౌరవం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సిద్ధాపూర్‌లో ప్రతిపాదించిన ఎకో టౌన్, డంపింగ్ యార్డు ఏర్పాటును పూర్తిగా విరమించుకుని, అవసరమైతే ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలించాలని సూచించారు.ప్రజల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఈ ఉద్యమం మరింత ఉధృతమవుతుందని, ఆ ఉద్యమానికి తాను సంపూర్ణ మద్దతు అందిస్తానని పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ప్రకటించారు.అలాగే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో డంపింగ్ యార్డు ప్రభావం పడనున్న సుమారు 22 గ్రామాల్లో పాదయాత్రలు, సంఘీభావ కార్యక్రమాలు, గ్రామసభలు నిర్వహించి ప్రజలను సంఘటితం చేస్తామని తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, సిద్ధాపూర్ డంపింగ్ యార్డు ప్రతిపాదనను పూర్తిగా రద్దు చేసే వరకు ఉద్యమాన్ని మరింత ఉద్ధృతంగా కొనసాగిస్తామని ఆయన



స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు మోహన్ సింగ్ నాయక్, సీనియర్ నాయకులు ప్రతాప్ రెడ్డి, బావండ్ల మాణిక్యం, సుధాకర్ అప్ప, మండల ప్రధాన కార్యదర్శి వన్నం శ్రీనివాస్, జి. శ్రీధర్ ఆచారి, బీజేపీ షాద్‌నగర్ టౌన్ ఉపాధ్యక్షుడు అల్లం అనిల్ గౌడ్, పవన్ కుమార్ రెడ్డి, వన్నం జంగయ్య, కొండల ఆచారి, బి. నరసింహ, గోవర్ధన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, వన్నం యాదయ్య, వన్నం ప్రభాకర్, వన్నం రామ్, పాముల మురళి, మధు, బి. సురేష్, జి. శివ, బడుక శేఖర్, పిపల చిన్నా, జి. సత్యం, కే. నరేష్, బి. శివ, జి. మోహన్, నరేష్, వడ్డే మల్లేష్, గూని మహేష్, గూని నవీన్ తదితర నాయకులు, కార్యకర్తలు, స్థానిక గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి సమష్టి కృషి అవసరం

**హైదరాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) :** జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు, మీడియా యాజమాన్యాలు, పాత్రికేయ సంఘాలు సమన్వయంతో పనిచేయాలని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆదివారం హైదరాబాద్ లోని హైబిట్స్ లో గల తెలంగాణ సరస్వత పరిషత్ ఆడిటోరియం రాష్ట్ర జర్నలిస్టుల కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.నిజాయితీ, నిబద్ధతతో వార్తలను ప్రజలకు అందించే పాత్రికేయుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా జర్నలిస్టులు తమ నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవాలని సూచించారు. జర్నలిస్టులకు ఆరోగ్య బీమా, గృహ వసతి, పెన్షన్, ప్రమాద బీమా వంటి సంక్షేమ పథకాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించాలని కోరారు.--- రైల్వే పాసుల పునరుద్ధరణ అంశాన్ని మళ్లీ కేంద్రం దృష్టికి తీసుకెళ్తా జర్నలిస్టులకు గతంలో అమలులో ఉన్న రైల్వే ప్రయాణ రాయితీ పాసుల పునరుద్ధరణ అంశాన్ని మరోసారి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ హామీ ఇచ్చారు. రాష్ట్ర జర్నలిస్టుల కార్యవర్గ సమావేశంలో మాట్లాడిన ఆయన, ఈ అంశాన్ని గతంలోనూ కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. జర్నలిస్టుల వృత్తిపరమైన అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే పాసుల సౌకర్యాన్ని పునరుద్ధరించాలని మరోసారి కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తానని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, వారి వృత్తిపరమైన సౌకర్యాల కోసం తనవంతు కృషి కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన జర్నలిస్టు ప్రతినిధులు తమ సమస్యలు, సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణతో పాటు సంక్షేమ కార్యక్రమాల అమలుకు సంఘటితంగా కృషి చేయాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర టీజెఏ అడ్వయిజరి కమిటీ చైర్మెన్ ఉప్పల లక్ష్మణ్ మాట్లాడుతూ టి జే ఏ ను ప్రభుత్వం గుర్తింపు ఇచ్చిందని, అన్ని జిల్లాలో అక్రిడిటేషన్ కమిటీలు వేశామని, డిఎంఏసీ. కమిటీలు జిల్లాలో టి జే ఏ సభ్యత్వం పెంచాలన్నారు. టి జే ఏ ను ప్రభుత్వం గుర్తించినందుకు ప్రభుత్వనికి కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎన్ యూ జే (ఐ) కృషి చేస్తుందని ఎన్ యూ జే (ఐ) జాతీయ ఉపాధ్యక్షుడు ఉక్కల్కర్ రాజేందర్ నాథ్ మాట్లాడుతూ అన్నారు. జర్నలిస్ట్ రైల్వే పాస్ ల గురించి




పలుమార్లు కేంద్రం మంత్రుల దృష్టికి తీసుకెళ్ళాం అన్నారు. టి జే ఏ అక్రిడిటేషన్ జిల్లా కమిటీలకు పలు సూచనలు చేసారు. టి జే ఏ కు తెలంగాణ ప్రభుత్వం గుర్తింపు ఇచ్చినందుకు సీఎం.రేవంత్ రెడ్డి కి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, టి జే ఏ కు ప్రభుత్వ గుర్తింపు కోసం సహకారం అంధుబచిన హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కు కృతజ్ఞతలు తెలిపారు.టి జే ఏ రాష్ట్ర అధ్యక్షులు రమణ రావు మాట్లాడుతూ రాష్ట్ర అక్రిడిటేషన్ కమిటీ సభ్యునిగా అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ వచ్చేలా చేస్తున్నాం అన్నారు. సమిష్టి కృషి వల్ల ప్రభుత్వం టి జే ఏ ను గుర్తించిందన్నారు. జిల్లాలో జర్నలిస్టుల సమస్యలపై తమ దృష్టికి తేవాలన్నారు. జిల్లా అక్రిడిటేషన్ కమిటీల సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ నిజమోద్దీన్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి ఉంటుందన్నారు. తెలంగాణ తెలుగు దేశం పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్. ఏ ఎస్ రావు జర్నలిస్టుల సంక్షేమం పై మాట్లాడారు. ఈ సమావేశంలో ఎన్ యూ జే (ఐ )కార్యవర్గ సభ్యుడు ధన్నారపు రాజలింగం, టిజేఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరీ, టి జేఏ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు ఖాసీం, కార్యదర్శి నాగస్వామి, కోశాధికారి ఖలీల్ అహ్మద్, టి జే ఏ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు చింతల నీలకంఠం, పలు జిల్లాల డిస్ట్రిక్ట్ అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు, జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొన్నారు.

## అర్హత మేరకు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి



○ **జాయింట్ కలెక్టర్‌కు ఏపీజీఈఎస్ఏ వినతి**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు అర్హత మేరకు పదోన్నతులు కల్పించేలా అన్ని శాఖల అధికారులకు మార్గదర్శకాలు జారీ చేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సర్వీసు అసోసియేషన్ (ఏపీజీఈఎస్ఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవను కలిసి వినతిపత్రం అందజేసింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాష మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జారీ చేసిన ఉత్తర్వుల మేరకు జిల్లాలోని అన్ని శాఖల్లో ఉద్యోగులకు వారి అర్హతకు అనుగుణంగా పదోన్నతులు కల్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఇందుకు సంబంధించి జిల్లా అధికారులకు తగిన మార్గదర్శకాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రంపై జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు సంఘం నాయకులు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సంబంధిత శాఖల అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రెహమాన్, జిల్లా కార్యదర్శి రాఘవరెడ్డి, ఉపాధ్యక్షుడు రాజు, సహాధ్యక్షుడు బి. శ్రీనివాసరావు, నగర శాఖ అధ్యక్షుడు భాను, కార్యదర్శి శంకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణమూర్తి, అన్వర్ బాషా, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** భారత మాజీ ఉప ప్రధాని, ప్రముఖ జాతీయ నాయకుడు బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కార్యాలయంలో సోమవారం నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సామాజిక న్యాయం, సమానత్వం కోసం బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అణగారిన వర్గాల సాధికారతకు ఆయన అందించిన సేవలు దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతాయని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి



○ **14 మంది పట్టివేత.. రూ.51,300 నగదు, 13 సెల్‌ఫోన్లు స్వాధీనం**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** తాడేపల్లిలోని ఓ హోటల్‌లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై గుంటూరు జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 51,300 నగదు, 13 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సర్వీస్ రోడ్డులో ఉన్న హోటల్ విక్టరీ గ్రాండ్‌లోని గది నంబర్ 104లో పేకాట నిర్వహిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో డీఎస్‌బీ డీఎస్పీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ-2, తాడేపల్లి పోలీసులతో కలిసి ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా దాడి నిర్వహించారు. దాడిలో ఉండవల్లికి చెందిన ఓ వ్యక్తి పేకాట నిర్వహిస్తున్నట్లు గుర్తించగా, మొత్తం 14 మంది పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ. 51,300 నగదు, 13 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని, నిందితులను తదుపరి చట్టపరమైన చర్యల కోసం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు లేదా పోలీస్ హెల్ప్‌లైన్‌కు తెలియజేయాలని ప్రజలను కోరారు.

# ఎన్యూమరేషన్ ఫారాలు వెంటనే ఇవ్వండి

○ **ఫారాలు నింపడంలో కూటమి నేతల సహకారం తీసుకోండి**

○ **సర్ పై ప్రజలు చైతన్యవంతులు కావాలి**

○ **బీఎల్వోలకు పూర్తి సహకారం అందించాలి**

○ **12వ డివిజన్ లో పర్యటించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** బూత్ లెవెల్ అధికారులు మీకు అందించిన ఎన్యూమరేషన్ ఫారాలను తిరిగి అప్పగించారా ? ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేయడంలో ఏవైనా సందేహాలు ఉన్నాయా ? వెంటనే ఫారాలను బూత్ లెవెల్ అధికారులకు ఇవ్వండి అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ సూచించారు. నియోజకవర్గంలో ఇంటింటి పర్యటనలో భాగంగా సోమవారం స్థానిక 12 డివిజన్ లో ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సర్ కార్యక్రమంలో భాగంగా బీఎల్వోలు ఎన్యూమరేషన్ ఫారాలు అందించారా అని అడిగి తెలుసుకున్నారు. కుటుంబీకుల వివరాలను ఓట్లకు మ్యాచ్ అవుతున్నాయో ? లేదో సరి చూసుకోవాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేస్తే వెంటనే బీఎల్వోలకు అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. సమయం చాలా తక్కువగా ఉన్నందున గుంటూరు తూర్పు నియోజకవర్గ ఓటర్లందరూ వెంటనే స్పందించాలని కోరారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేయడంలో ఏవైనా సందేహాలు ఉంటే కూటమి నాయకుల వద్ద సహకారం తీసుకోవాలని, వారు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. సర్ గడువు చివరి రోజుల్లో ఏవైనా సర్వర్ సమస్యలు తలెత్తితే ఇబ్బందులు ఎదురవుతాయని, కావున ఓటర్లందరూ చైతన్యవంతులై సర్ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. వీటితోపాటు గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పింఛన్లు, శానిటేషన్ వంటి అంశాలపై ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి సమస్యకూ ప్రణాళికాబద్ధంగా పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే నసీర్ హామీ ఇచ్చారు.

## ఇంటి నుంచే ఓటరు వివరాల నమోదు.. ఆన్‌లైన్ ఎన్యూమరేషన్‌కు అవకాశం

○ **జూలై 14లోగా ప్రక్రియ పూర్తి చేయాలని కమిషనర్ పిలుపు**




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగర పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఓటర్లు ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో ఎన్యూమరేషన్ పూర్తి చేసుకునే అవకాశం కల్పించినట్లు నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి కె. మయూర్ అశోక్ తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇటీవల నివాసం మార్చుకున్న వారు, ప్రస్తుతం స్వగ్రామానికి దూరంగా ఉన్న వారు, ఓటర్ల జాబితాలో పేరు లేదని భావిస్తున్న అర్హులైన పౌరులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ) కోసం వేచి చూడకుండా మొబైల్ లేదా ల్యాప్‌టాప్ ద్వారా voters.eci.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లోనే ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేయవచ్చని తెలిపారు.

ఓటర్లు voters.eci.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి ఈపీఐసీ (ఓటరు గుర్తింపు కార్డు) సంఖ్య నమోదు చేసి, నమోదిత మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీతో లాగిన్ కావాలని సూచించారు. అనంతరం ఆధార్ ఆధారిత ఈ-సైన్ ద్వారా వివరాలను ధ్రువీకరించి ప్రక్రియను పూర్తిచేయవచ్చని వివరించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే ఈ సేవలను వినియోగించుకోవచ్చని, జూలై 14లోగా ఎన్యూమరేషన్ పూర్తి చేసి ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

## ఎస్సీ ఉపవర్గీకరణలో పదోన్నతుల రిజర్వేషన్లపై సర్వీస్ రూల్స్ సవరణలు చేయాలి

○ **జీఏడి ప్రధానకార్యదర్శి రావత్ కు వినతి పత్రం అందచేసిన ఎంఈఎఫ్ నాయకులు**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఎస్సీ ఉపవర్గీకరణ అమలు నేపథ్యంలో పదోన్నతుల్లో రిజర్వేషన్లకు సంబంధించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్--1996లో పలు కీలక సవరణలు చేయాలని కోరుతూ జీఏడి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావత్ కు సోమవారం ఆంధ్రప్రదేశ్ మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి భిక్షాలు మాదిగ, కత్తి రమేష్, శెట్టిపోగు లక్ష్మణ్ వినతిపత్రం అందచేశారు. వినతి పత్రంలో ఉపవర్గీకరణ అమలు ద్వారా సామాజిక న్యాయం సాధనకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ, గ్రూప్--1, గ్రూప్--2, గ్రూప్--3లకు కేటాయించిన రిజర్వేషన్ శాతాల ప్రకారం పదోన్నతుల్లో ప్రాతినిధ్య (అడిక్వసీ) లెక్కింపును విడివిడిగా నిర్వహించాలని కోరారు. ప్రస్తుతం మొత్తం ఎస్సీ కోటాను ఒకే యూనిట్‌గా పరిగణించడం వల్ల వెనుకబడిన గ్రూపులకు నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. అలాగే 200 పాయింట్ల రోస్టర్ వ్యవస్థలో రెండో సైకిల్‌లో గ్రూప్--2కు సంబంధించిన రోస్టర్ పాయింట్ల కేటాయింపులో లోపాలు ఉన్నాయని, వాటిని సవరించి సామాజిక న్యాయ సూత్రాలకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించాలని విజ్ఞప్తి చేశారు. చిన్న క్యాడర్లలో (ఐదుకంటే ఎక్కువ పోస్టులు ఉన్న చోట్ల) గ్రూప్--1కు కనీసం ఒక పోస్టును ప్రాతినిధ్యంగా పరిగణించే విధంగా నిబంధనలు తీసుకురావాలని కోరారు. ప్రస్తుతం 1 శాతం రిజర్వేషన్ కారణంగా గ్రూప్--1 అభ్యర్థులకు పదోన్నతుల్లో అవకాశాలు దాదాపు లేకుండా పోతున్నాయని వినతిపత్రంలో వివరించారు. అదేవిధంగా, పదోన్నతుల్లో ఎస్సీ మూడు గ్రూపులకు వేర్వేరుగా రోస్టర్ రిజిస్టర్లు నిర్వహించడం, సీనియారిటీ జాబితాల్లో అభ్యర్థి చెందిన ఎస్సీ గ్రూపును నమోదు చేయడం తప్పనిసరి చేయాలని సూచించారు. ఎస్సీ ఉపవర్గీకరణ అసలైన లక్ష్యం వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమేనని, అందుకు అనుగుణంగా సర్వీస్ రూల్స్‌లో అవసరమైన మార్పులు చేసి రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15(4), 16(4) స్ఫూర్తిని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ దాడి

○ **నిర్వాహకురాలు సహా నలుగురు అదుపులో..**

○ **సెల్‌ఫోన్లు, ఇతర సామగ్రి స్వాధీనం**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగరంలోని పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధి విద్యానగర్‌లో వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్న గృహంపై గుంటూరు జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం దాడి నిర్వహించారు. ఈ ఘటనలో నిర్వాహకురాలు సహా నలుగురిని అదుపులోకి తీసుకుని సెల్‌ఫోన్లు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల వివరాల ప్రకారం.. విద్యానగర్ 4/1 లైన్‌లోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్‌కు విశ్వసనీయ సమాచారం అందడంతో డీఎస్‌బీ డీఎస్పీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ సిబ్బందితో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించారు. దాడిలో ముగ్గురు మహిళలు, ఒక విటుడిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, నాలుగు కండోమ్ ప్యాకెట్లతో పాటు కేసుకు సంబంధించిన ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో నిర్వాహకురాలు వాట్సాప్ ద్వారా మహిళల ఫోటోలు పంపించి విటులను ఆకర్షిస్తూ వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

నిందితులను, స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల కోసం పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

## చేతులు కోల్పోయిన దివ్యాంగులకు ఉచితంగా అధునాతన కృత్రిమ చేతులు



○ **ఆగస్టు 2న గుంటూరులో ప్రత్యేక శిబిరం**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రమాదాల్లో చేతులు కోల్పోయిన దివ్యాంగులకు అత్యాధునిక కృత్రిమ చేతులను ఉచితంగా అందించేందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ, రోటరీ ఇంటర్నేషనల్ సహకారంతో ప్రత్యేక శిబిరాలను నిర్వహించనుంది. అమెరికాకు చెందిన ఎల్ఎన్-4 హ్యాండ్ ప్రాజెక్ట్ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా గుంటూరు, విజయనగరం, అనంతపురంలో ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ అధ్యక్షుడు తెలిపారు.

గుంటూరులో ఈ శిబిరాన్ని ఆగస్టు 2న నిర్వహించనున్నారు. అధునాతన సాంకేతికతతో రూపొందించిన ఈ కృత్రిమ చేతుల ద్వారా చేతులు కోల్పోయిన దివ్యాంగులు ఇతరులపై ఆధారపడకుండా తమ రోజువారీ పనులను స్వయంగా చేసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు.

జిల్లాలోని అన్ని మండలాల్లో చేతులు కోల్పోయిన దివ్యాంగులను గుర్తించి ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గుంటూరు జిల్లా శాఖ కాల్ సెంటర్ 8866306969ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులైన దివ్యాంగులు ఈ ఉచిత సేవను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## రావూరి నరసింహారావు ఆరో వర్ధంతి



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రముఖ యోగా మాస్టర్, ఆధ్యాత్మిక సేవకుడు స్వర్గీయ రావూరి నరసింహారావు ఆరో వర్ధంతిని పురస్కరించుకుని మంగళగిరి సిటీ కేబుల్ కార్యాలయంలో సోమవారం రాత్రి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక సిటీ కేబుల్ అధినేత, జర్నలిస్ట్ రావూరి రమేష్‌బాబు, న్యూస్ ఎడిటర్ కొలికపూడి రూఫస్, సిటీ కేబుల్ సిబ్బంది కలిసి రావూరి నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మంగళగిరి ప్రాంతంలో సుదీర్ఘకాలం పాటు యోగా గురువుగా సేవలందించిన రావూరి నరసింహారావు ఎందరో శిష్యులను తీర్చిదిద్దారని కొనియాడారు. యోగా ప్రచారంతో పాటు ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను నిర్వహించి సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఆయన సేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని, ఆయన ఆశయాలను కొనసాగించడం ద్వారా నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు. దివంగత రావూరి నరసింహారావు ఆత్మకు శాంతి చేకూరాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిటీ కేబుల్ మేనేజర్ మాచర్ల శ్రీనివాసరావు, సిబ్బంది పాటిబండ్ల జగదీష్, పెట్టేం బాలకృష్ణ, మావిడి పాపారావు, హనుమర్లపూడి మోహనరావు, తిరుమలశెట్టి నాగరాజు, బండారు సాంబశివరావు, కోన శ్రీనివాసరావు, శివరాత్రి శ్రీనివాసరావు, కాంద్రుకుంట దినేష్, బాపనపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాలి

○ **ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఎఐటీయూసీ ఆధ్వర్యంలో వినతి**

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతో పాటు సమాన వేతనాలు, సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని ఎఐటీయూసీ అనుబంధ ఏపీఎస్ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. సోమవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేసింది.

యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలని, వేతనాలను నేరుగా ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆర్టీసీ ఆసుపత్రుల్లో వైద్య సౌకర్యం, కార్పొరేట్ ఇన్సూరెన్స్, బస్సు ప్రయాణ సౌకర్యం, మాతృత్వ సెలవులు, జీతంతో కూడిన వారాంత, జాతీయ, రాష్ట్ర సెలవులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ నియామకాల్లో సీనియారిటీ ఆధారంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, డేటా ఎంట్రీ ఆపరేటర్లు సహా తక్కువ వేతనాలతో పనిచేస్తున్న ఉద్యోగులకు నైపుణ్యానికి అనుగుణంగా వేతనాలు సవరించాలని కోరారు. అద్దె బస్సుల డ్రైవర్లు, ఆన్‌కాల్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా తదితర సౌకర్యాలు కల్పించాలని, విధి నిర్వహణలో మృతి చెందిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ బస్సులను ప్రైవేట్ ఆపరేటర్లతో కాకుండా ఆర్టీసీ ద్వారానే నిర్వహించాలని, విద్యుత్ బస్సుల కారణంగా తొలగింపునకు గురైన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఇతర డిపోల్లో సర్దుబాటు చేయాలని కోరారు. జాయింట్ కలెక్టర్ వినతిపత్రాన్ని స్వీకరించి సంబంధిత అధికారులకు పంపించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు వేముల బాజీ, జిల్లా కార్యదర్శి అశోక్‌తో పాటు జిల్లా నాయకులు దేరంగుల పద్మ, సుజాత, పద్మ, సుభద్ర, మరియమ్మ, పార్వతి, దుర్గ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయాల సాధనే బీజేపీ లక్ష్యం

○ **బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ**



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, మహోన్నత జాతీయవాది డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలను విజయవాడలోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నాగోతు రమేష్ నాయుడు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి బీజేపీ కార్యకర్త శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని గర్వంగా జరుపుకుంటున్నారని అన్నారు. దేశ స్వాతంత్ర్యం, జాతీయ సమైక్యత కోసం అహర్నిశలు కృషి చేసిన మహానుభావుల్లో శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఒకరని పేర్కొన్నారు.

పశ్చిమ బెంగాల్‌కు చెందిన గొప్ప జాతీయ నాయకుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచారని, విదేశీ చొరబాట్లను అడ్డుకోవాల్సిన అవసరాన్ని చాలా ముందుగానే గుర్తించి దేశానికి హెచ్చరికలు చేశారని తెలిపారు. నేడు పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ కాషాయ జెండా రెపరెపలాడటానికి ఆయన ఆశయాలే ప్రేరణగా నిలిచాయని చెప్పారు.

డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ కలలుగన్న ఏకాత్మ భారత సాధన దిశగా కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు ఆయన ఆశయాలకు నిజమైన నివాళిగా నిలిచిందని పేర్కొన్నారు. జాతీయవాద ప్రభుత్వాల కారణంగా దేశ భద్రత మరింత బలోపేతమై చొరబాటుదారుల ప్రయత్నాలకు అడ్డుకట్ట పడిందని తెలిపారు.

రాజకీయాల కంటే జాతి, దేశ ప్రయోజనాలనే అత్యున్నతంగా భావించిన మహానేత శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. స్వాతంత్ర్యం అనంతరం దేశ సమైక్యత కోసం ప్రాణత్యాగం చేసిన తొలి మహానుభావుల్లో ఆయన ఒకరని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య విలువలకు భారతీయ జనతా పార్టీ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఆ విలువలను ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు.

ఈ సందర్భంగా 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ, దేశమంతా ఒకే రాజ్యాంగం, ఒకే విధానం అమలు కావాలన్నది డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సంకల్పమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆ సంకల్పం కార్యరూపం దాల్చిందని, జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఒకే రాజ్యాంగ వ్యవస్థ అమలవుతోందని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ సాధించిన విజయాలు కూడా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయాల ప్రభావమేనని అన్నారు.

సమావేశానికి బీజేపీ రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి ఉప్పలపాటి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాల సాధనకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారు దిలీప్ డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జీవిత విశేషాలను వివరించారు. జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం అతిథులను ఆహ్వానించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ మాట్లాడుతూ, డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్యరూపంలోకి తీసుకువస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వల్లూరు గంగాధర్, వెంకటేశ్వర్లు యాదవ్, కాకాని తరుణ్‌తో పాటు పలువురు బీజేపీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## నాటక రంగాన్ని బతికించాల్సిన అవసరం ఉంది: ఎమ్మెల్సీ ఆలపాటి



○ తెనాలిలో రాష్ట్రస్థాయి నాటికల పోటీల ప్రారంభం

**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్)** : నాటక రంగాన్ని పరిరక్షించి, కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈదర కళాపరిషత్, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెనాలిలోని శ్రీరామకృష్ణ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి తృతీయ ఆహ్వాన నాటికల పోటీలకు సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ కళలకు కాణాచిగా పేరొందిన తెనాలిలో రాష్ట్రస్థాయి నాటికల పోటీలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. సమాజంలో నాటక రంగానికి ప్రాధాన్యం తగ్గుతున్న నేపథ్యంలో కళారంగాన్ని నిలబెట్టేందుకు కృషి చేస్తున్న నిర్వాహకులు, కళాకారులు, కళాపోషకులను అభినందించారు. నాటక కళను భావితరాలకు అందించే బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

పోటీలలో భాగంగా కళాకారులు ప్రదర్శించిన 'కన్నీటికి విలువెంత', 'నీళ్లు... నీళ్లు', 'నువ్వో సగం -- నేనో సగం' నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వాహకులు ఈదర పూర్ణచందు, నన్నపనేని రాజకుమారి, బుర్ర సాయిమాధవ్, డీఎల్ కాంతారావు ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

## శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు యువతకు స్ఫూర్తి



○ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్)** : భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు, గొప్ప జాతీయవాది డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా సోమవారం భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొని ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, దేశ సమైక్యత, జాతీయవాదం కోసం డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగాలు, సేవలు నేటి యువతకు ఆదర్శప్రాయమని అన్నారు. దేశ ప్రయోజనాలను వ్యక్తిగత ప్రయోజనాల కంటే ఉన్నతంగా భావించి ఆయన సాగించిన ప్రజాజీవితం ప్రతి విద్యార్థికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. జాతీయ సమగ్రత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు.

దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని, ముఖర్జీ ఆశయాలను ఆచరణలో పెట్టేలా ముందుకు సాగాలని మాధవ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విద్యార్థులతో దేశభక్తి, జాతీయ చైతన్యంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పరుశురామరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జనసేన కార్యకర్తల మృతిపై మంత్రి సంతాపం



○ నిడదవోలులో బాధిత కుటుంబాలను కలిసి ధైర్యం చెప్పిన దుర్గేష్

**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్)** : నిడదవోలు పట్టణానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక నాయకులు, కార్యకర్తల మృతిపట్ల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ సోమవారం తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను స్వయంగా కలిసి పరామర్శించి ధైర్యం చెప్పారు. ముందుగా మాజీ సైనికుడు, జనసేన కార్యకర్త కోర రవి (ఆర్మీ రవి) నివాసానికి వెళ్లిన మంత్రి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తర్వాత వైఎస్సార్ కాలనీకి చెందిన జనసేన వార్డు కమిటీ సభ్యుడు దార్లంక ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. అలాగే స్థానిక నాయకుడు మద్దిపాటి ఫణింద్ర తల్లి రామలక్ష్మి నారాయణమ్మ మృతిపైనా సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా మరికొన్ని బాధిత కుటుంబాలను కూడా మంత్రి పరామర్శించారు.

## రిజర్వేషన్లు, భవిష్యత్ ఉద్యోగ అవకాశాలకు పూర్తి రక్షణ కల్పించాలి: ఎన్టీఏ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : జిల్లాల పునర్వ్యవస్థీకరణ, పోస్టుల పునఃపంపిణీ నేపథ్యంలో జిల్లాల వారీగా క్యాడర్ స్ట్రెంత్‌లో మార్పులు చోటుచేసుకుంటున్నందున, ఎస్సీ, ఎస్టీ, బీసీ/ఓబీసీ సహా అన్ని వర్గాల రిజర్వేషన్ హక్కులు, బ్యాక్‌లాగ్ పోస్టులు, భవిష్యత్ ఉద్యోగ అవకాశాలకు పూర్తి రక్షణ కల్పించే సమగ్ర విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ (ఎన్టీఏ) కోరింది. ప్రతి జిల్లాలో మంజూరైన పోస్టులు, ఖాళీలు, వర్గాల వారీ ప్రాతినిధ్యం, బ్యాక్‌లాగ్ వివరాలను సమగ్రంగా పరిశీలించి, క్యాడర్ స్ట్రెంత్‌లో వచ్చిన మార్పులకు అనుగుణంగా పోస్ట్-బేస్డ్ రోస్టర్‌ను నిబంధనల మేరకు సవరించాలని ఎన్టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కరణం హరికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. పునర్వ్యవస్థీకరణ కారణంగా రిజర్వేషన్ హక్కులు దెబ్బతినకూడదని, క్యాడర్ మార్పుల వల్ల భవిష్యత్ ఉద్యోగ అవకాశాలు తగ్గిపోకూడదని, బ్యాక్‌లాగ్ పోస్టులు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. అన్ని జిల్లాలకు సమానమైన భవిష్యత్ నియామక అవకాశాలు లభించేలా "డైనమిక్ క్యాడర్ స్ట్రెంత్-రిజర్వేషన్ పరిరక్షణ విధానం" రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. క్యాడర్ మార్పులతో ఏ వర్గానికీ అన్యాయం జరగకుండా అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించేందుకు అవసరమైతే పునర్వ్యవస్థీకరణ ప్రక్రియకు మరింత సమయం కేటాయించాలని కూడా ఎన్టీఏ కోరింది.

# ఏపీలో షూఆల్స్ ఆర్ & డీ, ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటుచేయండి



○ ఆంధ్రప్రదేశ్‌లో పాదరక్షల యూనిట్ పనులు వేగవంతం చేయండి

○ షూఆల్స్ సంస్థ ఛైర్మన్ లీ చియాంగ్-గెన్‌తో మంత్రి లోకేష్ భేటీ

**సియోల్ (సౌత్ కొరియా)**: దక్షిణ కొరియాకు చెందిన ప్రఖ్యాత మెడికల్ డివైస్ సర్టిఫైడ్ స్మార్ట్ హెల్త్‌కేర్ ఫుట్‌వేర్ సంస్థ షూఆల్స్ కంపెనీ లిమిటెడ్ ఛైర్మన్ & సీఈవో లీ చియాంగ్-గెన్‌తో ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్‌లో భేటీ అయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... షూఆల్స్ సంస్థ ప్రభుత్వంతో చేసుకున్న ఎంవోయూ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో పాదరక్షల తయారీ యూనిట్ పనులను వేగంగా ప్రారంభించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రూ. 300 కోట్లతో ఏర్పాటు కానున్న ఈ యూనిట్ ద్వారా సుమారు 3 వేల మందికి ఉపాధి లభించనుందన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఆర్ & డీ (R&D), ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటుచేసి, ఏపీని రిటైల్, డిస్ట్రిబ్యూషన్ హబ్‌గా మార్చాలని కోరారు.

షూఆల్స్ సంస్థ ఛైర్మన్ లీ చియాంగ్-గెన్ మాట్లాడుతూ... మాగ్నెటిక్ థెరపీ, షాక్ అబ్సార్షన్, కూలింగ్ సోల్స్, యాంటీ బాక్టీరియల్ మెటీరియల్స్ ఏకీకరణతో MFDS-సర్టిఫైడ్ మెడికల్ ఫుట్‌వేర్ తయారీలో తమ సంస్థ ప్రత్యేకత కలిగి ఉందని చెప్పారు.

సియోల్ నేషనల్ యూనివర్సిటీ, ఈవా ఉమెన్స్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్‌తో కలిసి AI స్మార్ట్ మెడికల్ ఫుట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని ఛైర్మన్ లీ చియాంగ్-గెన్ అన్నారు.



○ ఏపీలో సియోల్ సెమీ కండక్టర్స్ డిస్ ప్లే ఫ్యాబ్ ఏర్పాటు చేయండి

○ సియోల్ సెమీకండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ తాయెహ్యుంగ్ లీతో మంత్రి లోకేష్ భేటీ

**సియోల్ (సౌత్ కొరియా)**: సియోల్ సెమీ కండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ తాయెహ్యుంగ్ లీ తో ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్ లో భేటీ అయారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... 2026లో భారతదేశంలోని మొత్తం పెట్టుబడుల్లో 25శాతం, గత 24నెలల్లో 240 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆంధ్రప్రదేశ్ ఆకర్షించిందని చెప్పారు. పరిశ్రమ అవసరాలను గుర్తించి, నైపుణ్యాలను అందించడానికి నైపుణ్యం, కౌసలం పథకాలను ప్రారంభించామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కియా, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, ఎల్‌జీ కెమ్, ఎంసీఎన్‌ఎక్స్ (కెమెరా మాడ్యూల్స్), సోలమ్ (ఏసీ విడిభాగాలు), హ్వాసంగ్ (పాదరక్షలు) వంటి 40కి పైగా కొరియన్ కంపెనీలు తమ యూనిట్లను నెలకొల్పాయని చెప్పారు. ఏపీ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉందని, బుల్లెట్ రైళ్లు, రేర్ ఎర్త్ కారిడార్లు, గ్రీన్‌ఫీల్డ్ రాజధాని నగరాన్ని నిర్మించడంలో కేంద్రం మద్దతుతో ఏపీ ముందుకెళు తోందన్నారు. ఇటీవల ఇండియా సెమీ కండక్టర్స్ మిషన్ ఆమోదించిన ప్రాజెక్ట్ ఏఎస్ఐపీ, ఏపీఏసీ లిమిటెడ్ కొరియన్ కంపెనీతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. దీనిని శ్రీసిటీ లేదా దాని పరిసర ప్రాంతాల్లో సియోల్ సెమీ కండక్టర్స్ సంస్థ తమ డిస్‌ప్లే ఫ్యాబ్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. సియోల్ సెమీ కండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ తాయెహ్యుంగ్ లీ మాట్లాడుతూ తమ సంస్థ గతనెలలో ప్రపంచంలోనే మొట్టమొదటి హెచ్‌వీ ఆప్టో సెమీ కండక్టర్‌ను ప్రారంభించిందని చెప్పారు. భారత్ లో తమ సంస్థ ప్రస్తుతం సేల్స్, డిస్ట్రిబ్యూషన్ కార్యాలయానికి మాత్రమే పరిమితమైనట్లు తెలిపారు. భారత్ లో నేరుగా లేదా జాయింట్ వెంచర్ ద్వారా పెట్టుబడి ప్రణాళికలు ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని అన్నారు.



○ శ్రీ సిటీలో విద్యుత్ పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయండి

○ హ్యోసంగ్ హెవీ ఇండస్ట్రీస్ ప్రతినిధులతో మంత్రి లోకేష్ భేటీ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ పరికరాల తయారీ లేదా అసెంబ్లింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ హ్యోసంగ్ హెవీ ఇండస్ట్రీస్ కార్పొరేషన్‌ను ఆహ్వానించారు. దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా సోమవారం సియోల్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో పవర్ సిస్టమ్స్ పీయూ ప్రెసిడెంట్ యోకోటా తకేషితో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం రూ. 8 వేల కోట్ల విలువైన ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ ఉందని, 2034 నాటికి 15 గిగావాట్ల ట్రాన్స్‌మిషన్ రోడ్‌మ్యాప్‌తో 160 గిగావాట్ల స్వచ్ఛ ఇంధన లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. 7,248 మెగావాట్ల కొవ్వాడ అణు విద్యుత్ ప్రాజెక్టులతో పాటు పారిశ్రామిక అవసరాల దృష్ట్యా 765/800 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు, జీఐఎస్, స్టాట్‌కామ్ పరికరాలకు భారీ డిమాండ్ ఏర్పడనుందని వివరించారు. ఈ నేపథ్యంలో తిరుపతి లేదా శ్రీసిటీ సమీపంలో విద్యుత్ పరికరాల తయారీ లేదా అసెంబ్లింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

సమావేశంలో యోకోటా తకేషి మాట్లాడుతూ, హ్యోసంగ్ టీ అండ్ డీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ 2006 నుంచి భారతదేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తోందన్నారు. దేశంలో 66 నుంచి 800 కేవీ జీఐఎస్ పరికరాలను తయారు చేస్తున్న ఏకైక సంస్థ తమదేనని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని తెలిపారు.

## కూటమి ప్రభుత్వంలో ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం



**వేమూరు(జర్నలిస్ట్ ఫైల్)** : ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్--రీయింబర్స్‌మెంట్) ద్వారా వేమూరు నియోజకవర్గంలోని చుండూరు, అమృతలూరు మండలాలకు చెందిన నలుగురు లబ్ధిదారులకు మొత్తం రూ. 3,24,518 ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ మేరకు మంజూరైన చెక్కులను వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధితుల వైద్య ఖర్చుల బిల్లులను ఎమ్మెల్యే ప్రత్యేక సిఫార్సుతో ముఖ్యమంత్రి సహాయనిధి కార్యాలయానికి పంపించగా, పరిశీలన అనంతరం ప్రభుత్వం అర్హులైన వారికి ఆర్థిక సాయం మంజూరు చేసింది. చుండూరు మండలానికి చెందిన ముగ్గురికి రూ. 3,11,618, అమృతలూరు మండలానికి చెందిన ఒకరికి రూ. 12,900 చొప్పున మొత్తం రూ. 3,24,518 విడుదలైంది. చిన్నపరిమికి చెందిన విడియాల నాగ శ్యామల దేవికి రూ. 1 లక్ష, ఎడ్లపల్లికి చెందిన షేక్ అబ్దుల్ గఫూర్‌కు రూ. 92,737, మూల్పూరుకు చెందిన అల్లమనేని కృష్ణమూర్తికి రూ. 1,18,881, కూచిపూడికి చెందిన బెల్లం ఉమాకు రూ. 12,900 చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి పెద్ద భరోసాగా నిలుస్తోందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. కాగా, లబ్ధిదారులు ప్రభుత్వం, అలాగే తమకు సిఫార్సు చేసి ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## బ్రాహ్మణ సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం : బుచ్చిరాం ప్రసాద్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** : బ్రాహ్మణుల ఆర్థిక, విద్యా, సామాజిక అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర బ్రాహ్మణ వెల్‌ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ కలపటపు బుచ్చిరాం ప్రసాద్ తెలిపారు. బ్రాడీపేటలోని బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ కార్యాలయంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన అర్హులైన బ్రాహ్మణులకు రుణాలు అందించి స్వయం ఉపాధి, విద్యా అవకాశాలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు.

కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ మాట్లాడుతూ, అర్చకత్వం వంటి సంప్రదాయ వృత్తుల్లో కొనసాగుతున్న పేద బ్రాహ్మణ కుటుంబాలకు చేయూతనిచ్చే ఉద్దేశంతో కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ పనిచేస్తోందన్నారు. విద్య, చిన్న వ్యాపారాల కోసం అవసరమైన ఆర్థిక సాయం అందిస్తూ వారి జీవనోపాధి మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా పాలపాటి రవికుమార్ మాట్లాడుతూ, బ్రాహ్మణుల సంక్షేమం కోసం బుచ్చిరాం ప్రసాద్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్రాహ్మణులకు రాజకీయ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని బుచ్చిరాం ప్రసాద్ తెలిపారు. అర్హులైన యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో చెరుకూరి తిరుపతిరావు, కొత్తూరు వెంకటసుబ్బారావు, దర్శనపు శ్రీనివాస్, కొక్కెర శ్రీనివాస్ యాదవ్‌తో పాటు బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## 62 లక్షల మందికి పెన్షన్లు.. నెలకు రూ.2,700 కోట్ల వ్యయం

○ కూటమి అధికారంలోకి వచ్చిన 19 రోజుల్లోనే రూ.4 వేల పెన్షన్ హామీ అమలు

○ పెన్షన్లపై వైసీపీ ప్రజలను మోసం చేసింది

○ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెన్షన్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల హామీని అమలు చేసి లబ్ధిదారులకు న్యాయం చేసిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్ అన్నారు. సోమవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సామాజిక పెన్షన్ వ్యవస్థను ఎన్టీఆర్ ప్రారంభించగా, చంద్రబాబు ప్రభుత్వం దానిని మరింత బలోపేతం చేసిందన్నారు.

చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 19 రోజుల్లోనే వృద్ధాప్య, వితంతు పెన్షన్లను రూ. 3 వేల నుంచి రూ. 4 వేలకు పెంచి, ఏప్రిల్, మే, జూన్ నెలల బకాయిలతో కలిపి ఒక్కో లబ్ధిదారునికి రూ. 7 వేల చొప్పున చెల్లించిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 62 లక్షల మందికి సామాజిక పెన్షన్లు అందుతున్నాయని, ఇందుకోసం ప్రతి నెల రూ. 2,700 కోట్లకు పైగా ప్రభుత్వం వ్యయం చేస్తోందని తెలిపారు. వికలాంగులు, డయాలసిస్ రోగులు, మంచానికే పరిమితమైన వారికి అధిక మొత్తంలో పెన్షన్లు అందజేస్తున్నట్లు చెప్పారు.

2019 ఎన్నికల సమయంలో పెన్షన్‌ను ఒకేసారి రూ. 3 వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ వాగ్దానాన్ని అమలు చేయకుండా విడతల వారీగా పెంపు చేపట్టిందని ఆరోపించారు. కరోనా కాలంలో విద్యుత్ వినియోగాన్ని కారణంగా చూపి లక్షలాది పెన్షన్లను తొలగించిందని, క్యారీ ఫార్వర్డ్ విధానాన్ని కూడా రద్దు చేసి లబ్ధిదారులకు అన్యాయం చేసిందని విమర్శించారు.

రాబోయే నెల నుంచి మరో రెండు లక్షల వరకు కొత్త వితంతు పెన్షన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని అప్పసాని రాజేష్ తెలిపారు. సామాజిక పెన్షన్‌ను సంక్షేమ పథకంగా మాత్రమే కాకుండా ప్రభుత్వ బాధ్యతగా భావిస్తూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని, 'ఎన్టీఆర్ భరోసా' ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

# మంత్రి సత్యకుమార్‌పై అసత్య ప్రచారం మానుకోవాలి

○ పేర్ని నాని... సత్యకుమార్ రాజకీయ జీవితాన్ని తెలుసుకుని మాట్లాడాలి

○ మంత్రి సత్యకుమార్ నిజాయితీపై ఆరోపణలు హాస్యాస్పదం

○ వైఎస్సార్సీపీ కుట్రలను ప్రజలు నమ్మరు

○ కుల విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు సాగుతున్నాయి

○ ప్రజలు వైఎస్సార్సీపీకి గుణపాఠం చెబుతారు

○ పేర్ని నాని వ్యాఖ్యలపై బీజేపీ మండిపాటు

○ మంత్రి సత్యకుమార్‌పై అసత్య ప్రచారం చేస్తున్నారంటూ జయప్రకాష్ నారాయణ్ ఆగ్రహం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)**: మంత్రి సత్యకుమార్‌పై మాజీ మంత్రి పేర్ని నాని చేస్తున్న వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమని బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి జయప్రకాష్ నారాయణ్ విమర్శించారు. గుంటూరులోని పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలపై పోరాడుతున్న సత్యకుమార్ ప్రజాజీవితంలో ఎలాంటి ఆరోపణలకు తావివ్వకుండా పనిచేశారని చెప్పారు. అధికారాల కోసం పార్టీలు మారే వ్యక్తి కాదని, నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పనిచేస్తున్న నాయకుడని పేర్కొన్నారు.

వైఎస్సార్సీపీ నాయకులు తమ తప్పులను ప్రశ్నిస్తే కులాలు, మతాలు, ఇతర పార్టీల పేర్లు ప్రస్తావిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నిర్ణయాలను మంత్రులు గౌరవించడం సహజమని, దానిని రాజకీయ వివాదంగా మార్చడం సరికాదన్నారు. పేర్ని నాని సత్యకుమార్ రాజకీయ జీవితం గురించి తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్సీపీకి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

ప్రకాష్ రాజ్ సహా కొందరు విశ్లేషకులను ఉపయోగించి సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతోందని జయప్రకాశ్ నారాయణ్ ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ఆలయాలపై దాడులు, దళితులు, బీసీలపై జరిగిన ఘటనల సమయంలో స్పందించని వారు ఇప్పుడు రాజకీయ విమర్శలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అలజడి సృష్టించే ప్రయత్నాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనం శ్రీనివాస్, ఓబీసీ మోర్చా కార్యదర్శి కుమార్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, మీడియా ప్యానలిస్ట్ తాడువాయి రామకృష్ణ, ఈదర శ్రీనివాస్ రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నడ్డి నాగమలేశ్వరి, జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467